





పులిచింతల డ్యాం నుంచి నీటి విడుదల



సాగర్ నుంచి సాగరానికి..

- 26 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల
- క్రస్ట్ గేట్ల నుంచి పరవళ్లు తొక్కుతోన్న కృష్ణమ్మ
- ఇన్‌ఫ్లో 2,28,900.. ఔట్‌ఫ్లో 2,47,447 క్యూసెక్కులు
- 18 ఏళ్ల తర్వాత జూలైలో గేట్లు ఎత్తి నీటి విడుదల

నరసరావుపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పోటెత్తుతోన్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జునసాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా 587.40 అడుగులకు చేరి నిండు కుండలా మారింది. పైగా జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతోంది. డ్యాంలో నీటి మట్టం పూర్తి స్థాయికి చేరడంతో మంగళవారం సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తారు. దీంతో సాగరం దిశగా కృష్ణమ్మ పరుగులు పెడుతోంది. తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మణ్ మంగళవారం ఉదయం 10 గంటలకు జలాశయం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. సాయంత్రానికి మొత్తం 26 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.04 టీఎంసీలకు 305.74 టీఎంసీలకు నీటి నిల్వ చేరింది. జలశయానికి 2,28,900 క్యూసెక్కుల ప్రవాహం ఉంది. సాగర్ 26 గేట్లు ఎత్తి దిగువకు 2.10 లక్షల క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 28,014 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదలతో మొత్తంగా 2,47,447 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. భారీగా నీటిని విడుదల చేయడంతో జలాశయం దిగువ ప్రాంతవాసులను అధికారులు అప్రమత్తం చేశారు. నదీ తీరం వైపు వెళ్లకుండా పోలీసు, రెవెన్యూ శాఖలు చర్యలు తీసుకున్నారు. 18 ఏళ్ల తర్వాత జూలై నెలలో గేట్లు ఎత్తిని నీటిని దిగువకు విడుదల చేయడం ఇదే తొలిసారి.

పులిచింతలకు కృష్ణమ్మ పరవళ్లు

కేఎల్‌రావు పులిచింతల ప్రాజెక్టుకు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. సాగర్ నుంచి 2.47 లక్షల క్యూసెక్కుల వరద పులిచింతలకు చేరనుంది. ఇక్కడ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు 18,000 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పులిచింతల పూర్తిస్థాయి నీటి మట్టం 175 అడుగులు కాగా 162.6 అడుగులకు నీటి మట్టం చేరింది. 45.77 టీఎంసీలకు 28.64 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రెండు రోజుల్లో పులిచింతల ప్రాజెక్టు కూడా నిండుతుందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

పకడ్బందీగా.. బంగారు జాబితా

నిరుపేదలకు అన్ని విధాలుగా చేయూత నందించి వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకుల సంఖ్యలో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమంగా నిలవడం గమనార్హం. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పీ4 పథకాన్ని మరింత పారదర్శకంగా చేపట్టాలనే నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. దీంతో బంగారు కుటుంబాల ఎంపిక కోసం ఐదు అంశాలతో కూడిన మార్గ దర్శకాలను ప్రభుత్వం సిద్ధం చేయడంతో పాటు వివరాల నమోదుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ఇచ్చిన నమూనా ప్రకారం బంగారు కుటుంబాల ఎంపిక కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తోంది. ఇప్పటికే 70 శాతం గ్రామాలలో సర్వే పూర్తయిందని, ఆగస్టు మొదటి వారంలోగా బంగారు కుటుంబాల సంఖ్యపై పూర్తి స్థాయిలో స్పష్టత వస్తుందని అధికారులు చెబుతున్నారు.

మరోసారి పీ4 సర్వే

- అర్హులకే లబ్ధి చేకూరేలా చర్యలు
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ఐదు అంశాలు ప్రామాణికంగా ఎంపిక
- ఆగస్టు మొదటి వారానికి జాబితా సిద్ధం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గతంలో చేసిన సర్వే ప్రకారం జిల్లా వ్యాప్తంగా 62,388 కుటుంబాలను పీ4కు అర్హులుగా ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. ఈ కుటుంబాలను దత్తత తీసుకోవడానికి 4,368 మంది మార్గదర్శకులు ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. బంగారు కుటుంబాల ఎంపికను ఐదు ప్రామాణికాల ఆధారంగా ఎంపిక చేయాలన్నది ప్రభుత్వం తాజా నిర్ణయం. దీనిలో భాగంగా ఆదాయపు పన్ను పరిధిలోకి రాకపోవడం, శుభ్రమైన నీరు లేకపోవడం, బ్యాంకు ఖాతా, ఎల్‌పీజీ కనెక్షన్, విద్యుత్ సరఫరా లేకపోవడం వంటి ద్వారా ఇంటింటి సర్వే చేస్తున్నారు. ప్రభుత్వం పేర్కొన్న ఆ ఐదింటిలో మూడింటికి దూరంగా ఉన్న కుటుంబాలను బంగారు కుటుంబాల జాబితాలోకి తీసుకొచ్చి మార్గదర్శకులకు దత్తత ఇవ్వాలన్నది ప్రభుత్వ ఆలోచనగా ఉంది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారమే ప్రస్తుతం ఇంటింటి సర్వే జరుగుతోంది. ఈ వివరాలను సచివాలయ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు కూడా. తొలుత ప్రకటించిన బంగారు కుటుంబాల సంఖ్యలో కనీసం 4,000 వరకు తాజా సర్వే ప్రకారం తగ్గుదల నమోదు కావొచ్చని తెలుస్తోంది

మార్గదర్శకుల ఎంపికలోనూ..

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకుల సంఖ్య జిల్లాలో భారీగానే ఉంది. 4,368 మార్గదర్శకులతో (మిగతా 6వ పేజీలో)



బాపట్ల రూరల్‌లోని బంగారు కుటుంబాల స్థితిగతులు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి (పాత చిత్రం)

మూల్యాంకన వేతనం.. మరిచారు



పది పరీక్షల మూల్యాంకన వేతనాల చెల్లింపులను విద్యా శాఖ మరిచింది. మూల్యాంకనం జరిగి నాలుగు నెలలైనా ఇంతవరకు చెల్లింపులు జరగలేదు. సుదూర ప్రాంతాల నుంచి సొంత ఖర్చులు పెట్టుకుని వచ్చిన ఉపాధ్యాయులు మూల్యాంకన వేత నాల కోసం పడిగాపులు కాస్తున్నారు. ఒక్కో ఉపాధ్యాయుడికి సగటున రూ.4 వేల వరకు, సహాయకులకు రూ.2 వేలు చొప్పున చెల్లించాల్సి ఉంది.

- నాలుగు నెలలైనా విడుదలలో జాప్యం
- ఉపాధ్యాయుల వినతులను పట్టించుకోని విద్యాశాఖ
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రూ.2 కోట్లకు పైగా బకాయిలు
- గతేడాది పది సప్లిమెంటరీ, దూర విద్య పరీక్షల చెల్లింపుల్లోనూ నిర్లక్ష్యం

గుంటూరు(విద్య), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా సుమారు 5 వేల మంది ఉపాధ్యాయులకు దాదాపు రూ2 కోట్లకుపైగా మూల్యాంకన నిధులు విడుదల కావాల్సి ఉందని సమాచారం. వేతన చెల్లింపుల కోసం ఉన్నత, జిల్లా స్థాయిలో అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా వారు పట్టించుకోవడం లేదని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల నుంచి వసూలు చేసినా..

మూల్యాంకన చెల్లింపులకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాల్సిన అవసరం లేదు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఫీజులు చెల్లిస్తారు. ఇలా వసూలు చేసిన నగదును ప్రశ్నాపత్రాల ముద్రణ, కేంద్రాల నిర్వహణ, ప్రశ్నాపత్రాల రవాణా,ఇన్విజిలేటర్ల భత్యం, మూల్యాం కన వేతన చెల్లింపుల కోసం వినియోగించాలి. అంటే పరీక్షలకు సంబం.ధించిన ప్రక్రియలో ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాల్సిన అవసరం లేదు. విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజులను వసూలు చేస్తూ.. వారు జాప్యం చేస్తే ఫైన్లు వేస్తున్న ప్రభుత్వం చెల్లింపుల్లో జాప్యం ఎందుకు చేస్తున్నదో అర్థం కావడం లేదని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

ఏటా ఇదే తంతు..

పదో తరగతి మూల్యాంకన చెల్లింపులు విషయంలో ఏటా జాప్యం జరుగుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. గతేడాది పది సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకన చెల్లింపులు కూడా ఇంతవరకు పూర్తికాలేదని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఏడాది జరిగిన పది మూల్యాంకనానికి సబ్జెక్టుల వారీగా దాదాపు 5 వేల మంది ఉపాధ్యాయులు, వివిధ కేటగిరీలకు సంబంధించి మరో 400 మంది హాజరయ్యారు. దాదాపు పది రోజుల పాటు వారు మూల్యాంకన విధుల్లో పాల్గొన్నారు. విధుల్లో పాల్గొనేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి డీఏ కూడా చెల్లించాలి. ఇదిలా ఉంటే దూరవిద్య పరీక్షలకు సంబంధించిన మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు కూడా ఇంతవరకు చెల్లింపులు జరగలేదు. మూల్యాంకన కేంద్రాల్లో టెంట్లు, రవాణా, ఇతర ఖర్చుల కోసం కొంతమంది ఉపాధ్యాయులు సొంతంగా ఖర్చు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూల్యాంకన నిధులు విడుదల చేయాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రిప్పింగ్ పునరుద్ధరణకు.. గంట సమయం ఎందుకు..?

- ప్రజల ఫిర్యాదులనూ పట్టించుకోవడం లేదు
- లో వోల్టేజీ సమస్య ఎందుకు వస్తోంది
- సిబ్బంది అందుబాటులో ఉండడం లేదు
- జిల్లా సమీక్ష సమావేశంలో చీఫ్ సెక్రటరి

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్‌సరఫరాకు తరుచు అంతరాయం ఏర్పడుతోంది. 33 కెవీ సబ్‌స్టేషన్ ట్రిప్పింగ్ పునరుద్ధరణకు 53.27 నిమిషాల సమయం ఎందుకు పడుతోంది. అని సీఎస్ (చీఫ్ సెక్రటరీ) విజయానంద్ మంగళవారం బాపట్లలో కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో ప్రశ్నించారు. నెలరోజుల్లో సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ సేవలపై ప్రజల స్పందన, ప్రజాభిప్రాయ సేకరణలో 5ఫీడర్ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతున్నట్లు గుర్తించామన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసిన అధికారులు పట్టించుకోరా అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఇంకొల్లు, నిజాంపట్నం, బాపట్లలో లోవోల్టేజీ సమస్య ఎందుకు వస్తుందని అధికారులను ప్రశ్నించారు. వీటిపై ప్రజలు నుంచి వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది అందుబాటులో ఉండటంలేదనే ఫిర్యాదులు మరోసారి పునరావృతం కాకుండా చూడాలన్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. లోవోల్టేజి, హైవోల్టేజి,ట్రిప్పింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు.

బాపట్ల జిల్లాలో 62పనులు మంజూరు కాగా, 59 పనులకు సర్వే పూర్తిఅయ్యిందన్నారు. ఇప్పటికే 16పనులు పూర్తి కాగా 20 పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. నేటికి 15పనులు ప్రారంభించకపోవటం ఏమిటని గుత్తేదారులను నిలదీశారు. 33 కేవీ సబ్‌స్టేషన్‌లలో ఓవర్‌లోడ్ అవుతున్న 12ఫీడర్ విస్తరణ పనులలో 9పూర్తి కాగా మూడు మొదలు కాకపోవటం ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులుచేయటంలో గుత్తేదారులు జాప్యం చేయటం ఏమిటని నిలదీశారు. కాలం చెల్లిపోయిన విద్యుత్ స్తంభాలు తొలిగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. తీరప్రాంతాలలో విద్యుత్ స్తంభాలు దెబ్బతింటున్నాయని అధికారులు ఛీఫ్‌సెక్రటరి దృష్టికి తెచ్చారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. అన్నిరకాల పరిశ్రమలు నుంచి 100కోట్ల రూపాయల బకాయిలు రావాల్సి ఉండగా గృహాల నుంచి ఇంకా 102కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. పర్యావరణానికి ఎలాంటి హానీ లేని సౌరవిద్యుత్ వినియోగంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు.. పీఎం కుసుమ్ పథకం కింద బాపట్ల జిల్లాలో 8,844 మంది రైతులకు సౌరవిద్యుత్ పంపుసెట్‌లు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందన్నారు. ఈసమావేశంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఏపిసిడిసిఎల్ సీఎండి పి.పుల్లారెడ్డి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, విద్యుత్‌శాఖ డైరెక్టర్‌లు,జిల్లాఅధికారులు తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ ఫీడర్‌లు, బ్రేకర్‌లను పరిశీలించి సూచనలు చేస్తున్న చీఫ్ సెక్రటరి కె.విజయానంద్, కలెక్టర్

అన్నక్యాంటీన్ తనిఖీ

సూర్యలంకరోడ్డులోని అన్నక్యాంటీన్‌ను సీఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహారపదార్థాలు పరిశీలించి భోజనం చేస్తున్న వారితో మాట్లాడి నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు.

మూసుకుపోయిన రహదారి... ప్రయాణం ఎలా మరి..?



కరకట్టపైకి చొచ్చుకు వచ్చిన ముళ్ల చెట్లు

- రహదారిపైకి చొచ్చుకు వచ్చిన ముళ్ల చెట్లు
- ప్రమాదభరితంగా కరకట్ట రహదారి

కొల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రహదారిపైకి ముళ్ల చెట్లు చొచ్చుకు రావడంతో కరకట్ట మార్గం ప్రమాదభరితంగా మారింది. రెండు వాహనాలు తప్పుకునే విధంగా మార్గం ఉన్నప్పటికీ ముళ్ల చెట్లు రహదారిని సగం ఆక్రమించడంతో ఒక వాహనం వెళ్లేందుకు మాత్రమే వీలుగా ఉంది. దీని వల్ల ఎదురెదురు వాహనాలు వస్తే తప్పుకునే పరిస్థితి లేకపోవడంతో ముళ్ల చెట్లల్లోకి దూసుకు వెళ్లి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొల్లూరు లాకుల వద్ద నుంచి దోనేపూడి వరకు ఉన్న కరకట్ట రహదారిపై ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి రోడ్డుపైకి ఇరువైపులా విస్తరించాయి. రహదారి నిర్వహణ చేయాల్సిన ఆర్‌అండ్‌బీ, ఆర్‌సీ అధికారులు రోడ్ల మధ్య వరకు పెరిగిపోయిన పిచ్చి చెట్ల తొలగింపుపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిత్యం కరకట్టను పర్యవేక్షించాల్సిన ఆర్‌సీ అధికారులు, లస్కర్లు పెరిగిపోయిన చెట్లను చూసి తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కొత్తవారు ఈ మార్గంలో ప్రయాణిస్తూ రోడ్లను ఆక్రమించిన చెట్ల వల్ల ఎదుట వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు కరకట్టను పరిశీలించి మార్గాన్ని ఆక్రమించిన చెట్లను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేసి ప్రమాదాలను నిలువరించాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యుత్ ఉద్యోగుల.. బదిలీలో ప్రతిష్టంభన
- సర్కిల్స్ పునర్విభజనలో మార్పులు, చేర్పులపై కసరత్తు
- విభజన తరువాతనే బదిలీలపై దృష్టి సారించే అవకాశం

6

రాజధాని రైతులకు కౌలు జమ
- రాజధాని రైతులకు ఇప్పటివరకు రూ. 164.21 కోట్ల నగదు జమ

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం


తీగల దుర్గాప్రసాద్


అశోక వాణి

గుంటూరు(లీగల్), జూలై 29 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా కేంద్రంలో ఖాళీగా ఉన్న రెండు కోర్టులకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ రాష్ట్ర హోం శాఖ ప్రధా న కార్యదర్శి మంగళవారం ఉత్తర్వు లు జారీ చేశారు. గుంటూరు జిల్లా కోర్టులో సీనియర్ న్యాయవాదిగా పనిచేస్తున్న తీగల దుర్గాప్రసాద్‌ను పోక్సో కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. ఈయన గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో జిల్లా ప్రధాన న్యాయస్థానంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మూడేళ్లు పనిచేశారు. 40 సంవత్సరాలుగా గుంటూ రు జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. గుంటూరు ఒకటవ అదనపు జి ల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా గుంటూరు బార్ అసోసియేషన్‌కు చెం దిన మరో మహిళా న్యాయవాది సీహెచ్ ఎస్ అశోక వాణి వేజెండ్లను నియమించా రు. క్రోసూరు మండలం వేల్పూరుకు చెందిన ఈమె 2004 నుంచి జిల్లా కోర్టులలో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. వీరిరువురు మూడేళ్ల పాటు ఆయా పదవుల్లో కొనసాగుతూ పోలీస్ శాఖ తరపున కోర్టులలో తమ వాదనలు వినిపించనున్నారు.

సీఈఓతో ఎస్ఎస్‌జీ నోడల్ టీం భేటీ


జిల్లా పరిషత్ సీఈఓ జ్యోతి బసుతో భేటీ అయిన ఎస్ఎస్‌జీ నోడల్ టీం

గుంటూరు సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని 22 గ్రామ పంచాయతీల్లో తనిఖీలు చేపట్టనున్న ఎస్ఎస్‌జీ (స్వచ్ఛ సురక్ష గ్రామీన్)నోడల్ టీంతో జిల్లా పరిషత్ సీఈఓ వీర్ల జ్యోతిబసు భేటీ అయ్యారు. జిల్లా పరిషత్ లోని సీఈఓ ఛాంబర్ నందు మంగళవారం జరిగిన ఈ భేటీలో పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎస్ఎస్‌జీ నోడల్ టీం జిల్లాలో పర్యటించి పలు అంశాలను క్షుణ్ణం గా పరిశీలిస్తారని వెల్లడించారు. గ్రామం లోని పాఠశాలలు, అంగన్వాడీ, ప్రార్థనా స్థలాలు, హెల్త్ సెంటర్లు తదితర అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించటం జరుగుతుందని అన్నారు.

శిక్షణా కార్యక్రమం...

ట్రైనింగ్ మేనేజ్ మెంట్ పోర్టల్‌ప్రగతి పోర్టల్‌పై సాంకేతిక సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పరంగా జరిగే ప్రతి శిక్షణా కార్యక్రమాల వివరాలు ఖచ్చితంగా ట్రైనింగ్ మేనేజ్ మెంట్ పోర్టల్ నందు నమోదు చేయాలని సీఈఓ జ్యోతి బసు సూచించారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి పనులు చేసినప్పుడే గుర్తింపు

ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు

పెదనందిపాడు జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మంచి పనులు చేసినప్పుడే ప్రజల్లో గుర్తింపు వస్తుందని సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని నాగులపాడు బొడ్డురాయి సెంటర్లో మాజీ సర్పంచ్ ఆళ్ల రాఘవయ్య విగ్రహావిష్కరణను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ లావు నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో ఎంతో మంది పేదలు ఉన్నారని వారికి తమవంతుగా సహాయసహకారాలు అందించాలన్నారు. కుటుంబాలు సంతోషంగా ఉన్నప్పుడు సమాజం గురించి ఆలోచించాలన్నారు. అందరూ కలికట్టుగా పనిచేస్తే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. 37 సంవత్సరాలు గ్రామసర్పంచ్‌గా పనిచేసి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రాఘవయ్య ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత లావు రత్తయ్య మాట్లాడుతూ పేదరికం లేని సమాజం కోసం రాఘవయ్య పరితపించేవారని, అందరికీ సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పేదల పక్షాన నిలిచారన్నారు. నల్లమడ రైతు సంఘం జిల్లా నేత కొల్లా రాజమోహనరావు మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలను గుర్తించి వాటి సాధన కోసం ఆళ్ల రాఘవయ్య కృషిచేశారన్నారు. తాగు,సాగునీటి కోసం ఎన్నో ఉద్యమాలు చేపట్టారని ఆయన స్ఫూర్తితోనే తాము పోరాటాలు సాగిస్తున్నామన్నారు. తొలుత రమణ బృందం విప్లవగీతాలు ఆలపించారు. అన్నదాత మణి తనప్రాసతో రాఘవయ్య జీవిత చరిత్రను వివరిస్తూ గ్రామస్థులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం రాఘవయ్య కుటుంబ సభ్యులు అతిథులతో పాటు, స్థల దాత కాపు వెంకటసుబ్బారావు, రాఘవయ్య సమకాలికులు అయిన నంగినేని కోటేశ్వరరావు, తమలపాకుల రెడ్డంకుల్ లను దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్రా బాలకృష్ణ, ఆళ్ల విజయ్‌కుమార్, డాక్టర్ ఆళ్ల సుబ్బారావు, బండారు సుజాత, ఆళ్ల హరిప్రసాద్, లోకాదిత్య, సంగం డెయిరీ డైరెక్టర్ గొల్లపూడి శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బండి నాగబాబు, కమిటీ సభ్యులు ముత్తవరపు నాగేశ్వరరావు, పాటిబండ్ల నాగరాజు, నాగబాబు, ఆళ్ల ఫణిబాబు, బండి కిరణ్‌కుమార్, సందిరెడ్డి ఉమా, భీమినేని రవి తదితరులు పాల్గొన్నారు.


ఆళ్ల రాఘవయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లావు నాగేశ్వరరావు తదితరులు

విద్యుత్ ఉద్యోగుల.. బదిలీలో ప్రతిష్టంభన

- సర్కిల్స్ పునర్విభజనలో మార్పులు, చేర్పులపై కసరత్తు
- విభజన తరువాతనే బదిలీలపై దృష్టి సారించే అవకాశం

గుంటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలో ఉద్యోగుల బదిలీలపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. ఇటీవల సంస్థలో జరిగిన సర్కిల్స్ పునర్విభజనపై అనేక ప్రాంతాల నుంచి స్వల్ప అభ్యంతరాలు రావటంతో ఆ దిశగా ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప మార్పులు, చేర్పులపై దృష్టి సారించినట్లు సమాచారం. తద్వారానే ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. సీపీడీసీఎల్‌లో గత నెలలో సర్కిల్స్ పునర్విభజన చేసిన విషయం తెలిసిందే. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సీఆర్‌డీఏ, గుంటూరు, పల్నాడు, బాపట్ల సర్కిల్‌లో గత నెలలో మార్పులు, చేర్పులతో పునర్విభజన చేస్తూ సీఎండీ పీ పుల్లారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆయా సర్కిల్స్‌తో పాటు కృష్ణా జిల్లాలోనూ పలు సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప అభ్యంతరాలు వచ్చినట్లు సమాచారం. దాంతో సీఎండీ పుల్లారెడ్డి, టెక్నికల్ డైరెక్టర్ ఆవుల మురళీకృష్ణయాదవ్‌లు సర్కిల్స్ పునర్విభజనపై కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా పల్నాడు సర్కిల్స్ విభజనపై అభ్యంతరాలు వచ్చినట్లు తెలిసింది. ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన చిలకలూరిపేట డివిజన్‌లో సత్తెనపల్లి టౌన్, రూరల్ సబ్ డివిజన్‌లు ఏర్పాటు చేయటంపై కూడా అభ్యంతరాలు వచ్చాయని చెబుతున్నారు. పాత పద్ధతిలోనే సత్తెనపల్లి టౌన్, రూరల్ సబ్ డివిజన్ ప్రాంతాలను నరసరావుపేట డివిజన్‌లో కలిపితే వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని పేర్కొంటున్నారు. అలానే 17 సెక్షన్లతో సంస్థలోనే పెద్ద డివిజన్‌గా ఉన్న నరసరావుపేటలో పరిసర ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా విలీనం జరగాలని కోరుతున్నారు. అలానే ఈపూరు, బొల్లాపల్లి , రేమిడిచర్లను ఒక సబ్ డివిజన్‌గా చేసి బొల్లాపల్లిలో ఒక సబ్ డివిజన్ ఏర్పాటు చేస్తే వినియోగదారులకు మరింత ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక రైతులు కోరుతున్నారు. ఇందులో వ్యవసాయ కనెక్షన్‌లు పెద్దఎత్తున ఉన్నాయని గుర్తుచేస్తున్నారు. శావల్యాపురం, నూజెండ్ల, వినుకొండ టౌన్, రూరల్ ప్రాంతాలను చిలకలూరిపేట డివిజన్‌లో కలిపితే ఆయా ప్రాంత వినియోగదారులకు రాకపోకలకు కూడా అనుకూలంగా ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

త్వరలోనే ఉద్యోగుల విభజన

సర్కిల్స్ పునర్విభజనలో స్వల్ప మార్పులు, చేర్పులు కూడా తుది దశకు చేరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. పునర్విభజన అనంతరం కొత్త సర్కిల్స్, డివిజన్ కార్యాలయాలకు ఉద్యోగుల విభజన ప్రక్రియ ప్రారంభించనున్నారు. ఇప్పటికే ఉద్యోగుల బదిలీలపై ఆప్షన్స్ ప్రక్రియ చేపట్టిన అధికారులు ప్రస్తుతానికి పెండింగ్‌లో పెట్టారు. ఆగస్టు మొదటి, రెండు వారాల్లోనే ఉద్యోగుల విభజన ప్రక్రియ కూడా దాదాపు పూర్తి చేయనున్నట్లు సమాచారం.

పకడ్బందీగా బంగారు జాబితా!

(5వ పేజీ తరువాయి)

రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలిచింది. వీలైనన్నీ ఎక్కువ కుటుంబాలను దత్తత తీసుకోవాలనే లక్ష్యంతో వివిధ విభాగాల ప్రభుత్వ అధికారులను కూడా దత్తత తీసుకునే మార్గదర్శకుల జాబితాలో చేర్చారు. జిల్లా కలెక్టర్ వెంకటమురళి సైతం చెరుకుపల్లిలో పది ఎస్సీ కుటుంబాలను దత్తత తీసుకుని మార్గదర్శకుడిగా నిలిచారు. ఇదే కాకుండా వివిధ స్వచ్ఛంద సంఘాలను కూడా ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములను చేయడంలో అధికారులు విజయం సాధించారు

పది కుటుంబాలకు తగ్గకుండా...

ఒక్కో మార్గదర్శకుడు కనీసం పది కుటుంబాలను దత్తత తీసుకునేలా చూస్తే పర్యవేక్షణ కూడా సులభంగా ఉంటుందనేది ప్రభుత్వ ఆలోచన. కానీ జిల్లాలో స్థోమతను బట్టి పెద్ద సంఖ్యలో మార్గదర్శకులు ముందుకు రావడంతో ఒక్కొక్కరికి కనీసం ఒక్కో బంగారుకుటుంబాన్ని అయినా దత్తత ఇవ్వాలనే ఆలోచనను అధికారులు చేశారు. ప్రస్తుతం మార్గదర్శకుల విషయంలో స్వల్ప మార్పులు జరిగే అవకాశం కనబడుతోంది. కనీసం పదికుటుంబాలు యూనిట్‌గా బంగారు కుటుంబాల దత్తత కార్యక్రమాన్ని మార్గదర్శకులకు అప్పజెప్పేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది

ముమ్మర కసరత్తు...

పీ4 కార్యక్రమంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా అత్యంత పకడ్బందీగా బంగారు కుటుంబాల ఎంపిక జరగాలన్నది ప్రభుత్వ అంతిమ లక్ష్యంగా ఉంది. దీనికి అనుగుణంగానే ప్రామాణికాలు రూపొందించి పీ4 తుది జాబితా ఉండే దిశగా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. క్షేత్రస్థాయిలో ఇప్పటికే 70 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో మొత్తం సర్వే పూర్తవుతుందని, ఆగస్టు మొదటివారంలో తుదిజాబితా తయారు చేసేలా యంత్రాంగం అడుగులేస్తోంది.

రాజధాని రైతులకు కౌలు జమ

- రాజధాని రైతులకు శఠగోపం కథనాన్ని తప్పుపట్టిన సీఆర్‌డీఏ కమిషనర్ ● ఇప్పటివరకు రూ. 164.21 కోట్ల నగదు జమ ● ఇంకా రూ.61.34 కోట్ల మాత్రమే చెల్లించాలి ● సాంకేతిక కారణాలతోనే జాప్యం ● సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు

విజయవాడ, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతులకు 2024-25 ఏడాదికి సంబంధించి చెల్లించాల్సిన వార్షిక కౌలు డబ్బులను వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేసినట్టు సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు తెలిపారు. మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలుపుతూ, 'రాజధాని రైతులకు శఠగోపం' అనే శీర్షికతో ఓ పత్రికలో వచ్చిన కథనం అవాస్తమన్నారు. వాస్తవానికి రైతులకు మొత్తం రూ.225.55 కోట్లను కౌలు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.164.21 కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమచేసినట్టు తెలిపారు. ఇంకా రూ.61.34 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. రైతుల బ్యాంక్ ఖాతాల లింకేజీ ప్రక్రియలో వచ్చిన సాంకేతిక కారణాలు, కొంతమంది రైతులు తమ ప్లాట్లను అమ్మడం, అలాగే మరణించిన రైతుల కుటుంబసభ్యుల వివరాలు అందకపోవడంతో నిధులు జమకాలేదని కమిషనర్ తెలిపారు. గత శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో అందజేసిన ఫిర్యాదులను పరిష్కరించి కౌలు రైతులకు నగదును త్వరలో జమ చేయడం జరుగుతుందన్నారు. అయితే అర్హత ఉన్న రైతులకు సైతం కౌలు జమకాలేదని మాజీ సీఎం జగన్‌కు సంబంధించిన ఓ వార్తాపత్రిక తప్పుడు కథనాన్ని ప్రచురించిందని, ఆ వార్త పూర్తిగా అవాస్తవమని అధికారులు లెక్కలతో సహా వివరించారు.

డెకరేషన్ గోదాం దగ్ధం


దగ్ధమవుతున్న కాశీం డెకరేషన్ గోదాం

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 1వ వార్డు రామకృష్ణాపురంలో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కాశీం అండ్ సన్స్ డెకరేషన్స్ గోదాం దగ్ధమైంది. ఒక్కసారిగా అలుముకున్న మంట లు గోదాములో ఉన్న సామాను మొత్తానికి వ్యాపించాయి. ఎగసిపడుతున్న మంటలను స్థానికులు అదుపు చేయలేకపోయారు. బాపట్ల అగ్నిమాపక కేంద్రం వారి ఫైరింజన్ వేరేచోట జరిగిన అగ్నిప్రమాదం నివారించటానికి వెళ్ళటంతో ఇక్కడ మంటలను అదుపు చేయటానికి అగ్నిమాపక శకటం రాలేకపోయింది. చీరాల నుంచి అగ్నిమాపకశకటం వచ్చేసరికి గంటకుపైగా సమయం పట్టింది. దీంతో 50లక్షల రూపాయల విలువ చేసే సామాను మొత్తం బుగ్గిపాలయింది. ఉద్దేశపూర్వకంగానే పెట్రోల్‌పోసి నిప్పుపెట్టి ఉంటారని బాధితుడు ఎస్‌కే మస్తాన్‌వలి తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ సీఐ ఆర్ రాంబాబు క్లూస్‌టీమ్‌ను పిలిపించి సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరిస్తున్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా

డీవీసీ అభయ బీమా

సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల


బీమా పరిహార నగదు అందజేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూలై 29(ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ అభివృద్ధిలో భాగస్వాములైన పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా డీవీసీ అభయ బీమా పథకాలను అమలు చేస్తున్నట్లు సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. వడ్లమూడి సంగం డెయిరీలో మంగళవారం డీవీసీ అభయ పథకం కింద మంజూరైన పరిహార నగదును లబ్ధిదారుల కుటుంబాలకు నరేంద్రకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు మెరుగైన పాలధర బోనస్ అందిస్తున్నట్లు తెలిపారు. పాల ఉత్పత్తిదారుడు అకాల మరణం చెందితే వారి కుటుంబానికి అండగా సంగం డెయిరీ నిలవాలనే లక్ష్యంతో డీవీసీ అభయ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జడవల్లి గ్రామ పాల రైతు పిల్లి శారమ్మ కుటుంబ సభ్యులకు రు.1,29,144లు, మరో రు.10వేలు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం అందజేశారు. నిడుబ్రోలుకు చెందిన పొన్నగంటి సుబ్బారావు, నన్నపనేని వెంకటేశ్వరరావులకు రు.60వేలు, కర్లపాలెం మండలం బుద్దాం గ్రామ రైతు నర్రా రామయ్యకు రు.60వేలు, ఆకుల వాసుబాబుకు చెందిన పశువు మృతిచెందిన కారణంగా రు.50 వేలు అందించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యు లు వలివేటి ధర్మారావు, మరీదు వెంకటేశ్వరరావు, రీజనల్ మేనేజర్ పాతూరి ఆదినారాయణ, లబ్ధిదారులు, సంగం అధికారులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి వ్యాఖ్యలు దుర్మార్గం: పిల్లి మాణిక్యరావు

గుంటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, చంద్రబాబు నాటిన మొక్కలు రేపటి రోజున ఇదే ఫలితాలను చవిచూడాల్సి ఉంటుందని జగన్ రెడ్డి మాట్లాడటం దుర్మార్గమని ఏపీ లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు మన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందంజలో ఉంచడానికి పరిశ్రమలు తీసుకురావాలి, ఉద్యోగాలు కల్పించాలి, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లాలి అనే మొక్కలు నాటుతున్నాడని, వాటి ఫలాలు రేపటి రోజున రాష్ట్ర ప్రజలు, విద్యార్థులు, యువత అందుకుంటారని అన్నారు. జగన్ రెడ్డి విషపు మొక్కలు నాటాడని, అందుకే ఇప్పుడు విషపు ఫలాలు అనుభవిస్తున్నారని అన్నారు. జగన్ రెడ్డి అమరావతిని విధ్వంసం చేశాడని, నడిరోడ్డు మీద గొంతులు కోశారని, ఎస్సీలపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించి హింసించారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

చంద్రబాబు సింగపూర్ పర్యటనపై వైసీపీ దుష్ప్రచారం

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనపై దుష్ప్రచారం చేసే స్థితికి జగన్ దిగజారాడని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగపూర్ పర్యటనపై తన అవినీతి మీడియాలో, వైసీపీవారితో బురద జల్లిస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు కృషి ఫలించి, సింగపూర్ పర్యటన ఫలప్రదమై రాష్ట్రానికి పెట్టుబడులు వస్తే ప్రజలు తన కుట్ర రాజకీయాలను నమ్మరన్న దుర్బుద్ధితోనే జగన్ దుష్ప్రచారానికి తెగబడ్డాడని వివరించారు. సింగపూర్ ప్రభుత్వం, ఆ దేశ పారిశ్రామికవేత్తలు, వ్యాపారదిగ్గజాలు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు వెల్లడించే అంశాలు, రాష్ట్రంలోని అవకాశాలు, వనరుల వినియోగంపై సానుకూలత వ్యక్తం చేస్తూండటం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి శుభసూచకమైతే, జగన్ కు, వైసీపీకి మాత్రం మింగుడుపడని అంశంగా ఉందని పేర్కొన్నారు.

జిల్లాస్థాయిలో ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా

75 తాళ్లూరు జడ్పీ పాఠశాల



ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో చంద్రకళ

పెదకూరపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో ఉత్తమ పీఎంశ్రీ హైస్కూల్‌గా 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్ ఎంపికైందని జిల్లా విద్యా శాఖాధికారి ఎల్ చంద్రకళ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం జాతీయ విద్యా విధానం ఎన్ఈపీ 2020.. 5వ వార్షికోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ జాతికి అంకితం చేశారన్నారు. దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో 75 తాళ్లూరు జడ్పీ హైస్కూల్ ఉండటం తమ ఊరికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఏపీసీ ఆర్ రమేష్, ఏఎంవో పూర్ణచంద్రరరావు, ఎంఈవో పీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, శివ, ఏఈ అనుముల శ్రీనివాసరెడ్డి, బీ చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు. న్యూఢిల్లీ నుంచి ప్రసారమైన వివిధ కార్యక్రమాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తిలకించారు.

అనుమతులు లేకుండా కొండరాళ్ల తరలింపు

● అడ్డుకున్న మైనింగ్ అధికారులు ● రూ.16వేలు అపరాధ రుసుం విధింపు


మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్‌లు

యడ్లపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మైనింగ్‌శాఖ అనుమతులు లేకుండా కొండరాళ్ళను స్టోన్ క్రషర్‌లకు రవాణా చేస్తున్న టిప్పర్‌లను మైనింగ్ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. మైనింగ్‌శాఖ ఏడీ నాగిని తెలిపిన వివరాల ప్రకారం.. యడ్లపాడు మండలం వంకాయలపాడు పరిధిలోని గృహలక్ష్మి, ప్రజ్ఞ స్టోన్ క్రషర్ల నిర్వాహకులు ఎటువంటి అనుమతులు లేకుండా క్వారీయింగ్ నిర్వహిస్తున్నారు. వంకాయలపాడు పరిధిలో రెండు దశాబ్దాల క్రితం మూతపడిన కొండ క్వారీలోను, విశ్వనాధుని కండ్రిక అగ్రహారం పరిధిలోగల ఎర్రకొండలో అనుమతులు తీసుకోకుండా క్వారీయింగ్ జరిపి కొండరాళ్ళను క్రషర్‌లకు తరలించుకుంటున్నారు. అక్రమంగా కొండరాళ్ళను తరలిస్తున్న టిప్పర్‌లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ఒక్కొక్క టిప్పర్‌కు రూ.8వేలు చొప్పున రెండింటికి రూ.16వేలు జరిమానా విధించినట్లు ఈ సందర్భంగా ఏడీ తెలిపారు.

పచ్చదనం పెంపొందించాలి

విద్యార్థులకు దండా లక్ష్మీనారాయణ సూచన


విత్తన బంతులను తయారు చేస్తున్న విద్యార్థులు

నాదెండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనాన్ని పెంపొందించేందుకు విత్తన బంతులను తయారు చేయటంలో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని ప్రోగ్రాం కన్వీనర్ దండా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల కెల్లంపల్లి భద్రచలం ఉన్నత పాఠశాలలో వేప, గానుగ తదితర విత్తనాలను బంతులుగా తయారు చేసే కార్యక్రమాన్ని చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఉప్పుటూరి ప్రసాదు మాట్లాడుతూ వర్షా కాలంలో విత్తన బంతులను విసరటం ద్వారా మొక్కలు మొలచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయ న్నారు. ప్రధానోపాధ్యాయుడు ఐ కృష్ణా నాయక్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు సుమారు నాలుగు వేల విత్తన బంతులను తయారు చేసి చల్లే విధంగా లక్ష్యాన్ని పెట్టుకున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి బోడి రామ సుబ్బారావు, ఉప్పుటూరి భరత్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

51,233 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 52,870 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 51,233 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,308 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9500	13200
నెంబరు. 5	10000	13300
273	10000	12800
341	10000	13500
4884	---	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14000
షార్క్-1	-----	---
బ్యాడిగి	10000	12800
దేవనూరు డీలక్స్	10000	12400

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఆర్మూరు	9600	11000
ఏసీ కామన్ వెరైటీ		
334	9500	12600
నెంబరు. 5	10000	13400
273	10500	12800
341	10000	13600
4884	10000	12700
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	13800
బ్యాడిగి	10000	12400
దేవనూరు డీలక్స్	10000	12600
తాలుకాయలు	4500	7000



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● జాయింట్ యాక్షన్ కమిటీలో కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ జె.వెంకటమురళి హెచ్చరించారు. బాపట్ల మండలం అడవిపాలెం వద్ద సీమౌత్ ప్రాంతంలో తీరప్రాంత నియంత్రణ నిబంధనలను ఉల్లంఘించి జరిగిన ఆక్రమణలపై కఠినచర్యలు తప్పవన్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో సీమౌత్ జాయింట్ యాక్షన్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఇన్‌చార్జి జేసీ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, డీఎస్పీ జి.రామాంజనేయులు, తహసీల్దార్ షేక్.సలీమా, మత్స్యకారులు, డ్రైనేజి పోలీసు, మైనింగ్, సీఆర్‌జెడ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సీమౌత్‌ను ఎల్ ఆకారంలో పునరుద్ధరించేందుకు అవసరమైన విస్తీర్ణాన్ని గుర్తించేందుకు సంబంధిత శాఖలు సర్వే నిర్వహించి నివేదికను తక్షణమే సమర్పించాలని ఆదేశించారు. సీఆర్‌జెడ్ పరిధిని సూచిస్తూ ఏర్పాటు చేసి జెండాలను తొలిగించిన గుర్తు తెలియని వ్యక్తులపై విచారణ జరిపి అలాగే నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. తీరప్రాంతాలలో ప్రకృతి సమతుల్యతకు భంగం కలిగించే ఏమైనా అక్రమ నిర్మాణాలపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందిస్తుందని కలెక్టర్ చెప్పారు.

ప్రతిభ కనబరిచిన వారికి ఎస్పీ అభినందనలు



పట్టణ సీఐ ఆర్.రాంబాబుకు ప్రశంసపత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తుషార్‌డూడి

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులను ఎస్పీ తుషార్ డూడి అభినందించి ప్రశంసపత్రాలు అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లోక్‌అదాలత్‌తో ఎక్కువ కేసులు పరిష్కరించిన పట్టణ సీఐ ఆర్.రాంబాబు, అద్దంకి సీఐ సుబ్బరాజు, రేపల్లె పట్టణ సీఐ ఎ.మల్లికార్జునరావు, మార్టూరు ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, చీరాల వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సుబ్బారావు, వేమూరు సీఐ ఆంజనేయులు, రేపల్లె రూరల్ సీఐ ఆర్.సురేష్‌బాబులకు ప్రశంసపత్రాలు అందజేశారు. కోర్టు కానిస్టేబుళ్ళు కిరణ్, శివయ్య, నాగేశ్వరరావు, కరీముల్లా, నాగార్జులను కూడా అభినందించి ప్రశంసపత్రాలు అందజేసి ఇదేస్ఫూర్తితో నేరాల నియంత్రణకు కృషి చేయాలని కోరారు.

కేసుల పరిష్కారంలో కర్లపాలెం పోలీసుస్టేషన్‌కు ప్రథమస్థానం

కర్లపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత ఆరునెలల కాలంలో వివిధ కేసుల పరిష్కారంలో కర్లపాలెం పోలీసుస్టేషన్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర మంగళవారం ఎస్పీ తుషార్ డూడి చేతుల మీదగా ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు తెలియజేశారు. కేసుల పరిష్కారంకు మెగా లోక్అదాలత్, దొంగతనం కేసుల రికవరి తదితర వాటిల్లో కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర కృషితో జిల్లాలో మొదటి స్థానం సాధించారని తెలిపారు.

మాజీ కౌన్సిలర్ అంకమ్మరావు హఠాన్మరణం

● పార్టీలకు అతీతంగా ప్రముఖుల నివాళి



అంకమ్మరావు (ఫైల్)

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇమ్మడిశెట్టివారిపాలెంకు చెందిన మాజీ కౌన్సిలర్ ఇమ్మడిశెట్టి అంకమ్మరావు మంగళవారం హఠాన్మరణం చెందారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందిన అంకమ్మరావు 24వ వార్డు అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మృతి గురించి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ నాయకుడు అన్నం సతీష్ ప్రభాకర్ తన అనుచరులతో కలిసి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ నరాలశెట్టి ప్రకాశరావు, పుట్టా ఆదిశేషారెడ్డి, చాపల సుబ్రహ్మణ్యం, నాగరాజు, విశ్వనాధ్, శ్రీనివాస్, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణ, పి.సుబ్బారావు, సీహెచ్ రామసుబ్బారావు తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

వైసీపీ మద్యం పాలసీ ప్రజల పాలిట మరణశాసనం : కొల్లా

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ మద్యం పాలసీ ప్రజల పాలిట మరణశాసనం రాసిందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి ఆరోపించారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లిక్కర్ పాలసీని మార్చి కొత్తపాలసీని రూపొందించిందని ప్రజలు దానిని ఆమోదించారని దీనిని కూటమి ప్రభుత్వం తప్పుపట్టటం రాజకీయ కక్ష సాధింపు అంటూ ఆ పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అవాకులు, చెవాకులు పేలటం సిగ్గుచేటు అన్నారు. ప్రభుత్వమే లిక్కర్ షాపుల నిర్వహణ చేపట్టం వలన ముడుపులకు, అవినీతికి ఆస్కారమే లేదని సజ్జల ప్రగల్భాలు పలకటం జనవంచన అవుతుందని కొల్లా పేర్కొన్నారు.

బాపట్ల ఆణిముత్యం మాధవపెద్ది కాళిదాసు

● రేపు విగ్రహావిష్కరణ



మాధవపెద్ది కాళిదాసు (ఫైల్)

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల అణిముత్యం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, తొలితరం న్యాయవాది మాధవపెద్ది కాళీదాసు విగ్రహాన్ని గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డులో ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాన్ని ఈనెల 31వ తేదీన ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు తెలిపారు. స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశంకు కుడిభుజంగా ఉండి వారికి ఎనలేని ఆర్థిక, హార్దిక సహాయం అందించినట్లు తెలిపారు. ఆయన సంపాదనంతా స్వాతంత్ర్య పోరాటానికి, ధానధర్మాలకు, ధార్మిక కార్యక్రమాలకు, విద్యా కార్యక్రమాలకు వెచ్చించారన్నారు. 1945లో బాపట్ల వ్యవసాయ కళాశాల ప్రారంభ ఆహ్వానకమిటీ సభ్యుడిగా చురుకైన పాత్ర పోషించారన్నారు. గుంటూరులో హైకోర్టు ఏర్పాటుకు ఆయన ఎంతగానో కృషి చేశారన్నారు. బాపట్లలో రైల్వేస్టేషన్ ఏర్పాటు కోసం సహకారం అందించారన్నారు. ఆయన నివాసం ఉన్న మెడ వీధికి కాళీదాసు వీధి అని పురపాలక సంఘం నామకరణ చేసింది. అదే ప్రాంతంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేశారు.

తహసీల్దార్ కార్యాలయాలలో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలి


● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి తహసీల్దార్ కార్యాలయంలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుదే రాజారావు కోరారు. ఈ విషయమై మంగళవారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖలో అధికారులు పోస్టింగ్ ఇవ్వటంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. జిల్లాకు చెందిన రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పందించి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించటంతోపాటు డిప్యూటీ తహసీల్దార్‌ల నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు.

బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలు

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : బహుజన టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ వేడుకలను మంగళవారం జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేడుకలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బహుజన టీచర్స్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం ఏలియా, గవిని గోపాలకృష్ణమూర్తి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఐనంపూడి



ఐనంపూడి శ్రీనివాసరావు

కర్లపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా తనను నియమించినట్లు ఐనంపూడి శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఎంపీడీవోగా పని చేస్తున్న అద్దూరి శ్రీనివాసరావు శిక్షణా తరగతులకు నెలరోజులపాటు వెళ్ళారని ఐనంపూడి శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలి

● రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్

● ఫీడర్‌లు, బ్రేకర్లు క్షేత్రస్థాయిలో పరిశీలన

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్తు సరఫరాలో ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్ విద్యుత్‌శాఖాధికారులకు సూచించారు. జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద నూతనంగా ఏర్పాటు చేసిన ఫీడర్‌లు, బ్రేకర్లను మంగళవారం ఆయన క్షేత్ర స్థాయిలో నిర్వహణ పనులను పరిశీలించారు. తొలుత సూర్యలంకరోడ్డులోని 33/11 కెవి బాపట్లటౌన్-1 విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆయన పరిశీలించారు. స్మార్ట్‌మీటర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌లు, మైక్రోకంట్రోలర్‌ల పనుల పురోగతిపై అధికారులను ఆరా తీశారు. ఉపకేంద్రం నిర్వహణపై పలు సూచనలు చేశారు. పాతబడిన ఇనుప స్తంభాలకు రంగులు వేయాలని చెప్పారు. ఉప కేంద్రం నుంచి బాపట్లలోని పలుప్రాంతాలకు విద్యుత్ సరఫరా సమయంలో విద్యుత్ ఉపయోగం ఎక్కువ అవ్వటం వలన పటేల్‌నగర్ ఫీడర్‌లో 180 కెవి లోడ్ పెరిగి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. లోడ్‌ను నియంత్రించుటకు పటేల్‌నగర్, శృంగారపురంలలో విసిబి బ్రేకర్‌లు ఏర్పాటు చేయటమైనదని తెలిపారు. ఈ పనులను పూర్తి చేయుటకు రూ.20.10 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా 1.5 కిలోమీటర్లు విద్యుత్‌లైన్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, సీఎండీ పి.పుల్లారెడ్డి, విద్యుత్ ఎస్ఈ ఆంజనేయులు, ఆర్డీవో పి.గ్లోరియా, చంద్రశేఖర్, విద్యుత్ ఈఈలు, డీఈఈలు ఏఈఈలు పాల్గొన్నారు.



రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

అటవీశాఖ భూమిని పర్యాటక శాఖకు కేటాయించాలి

● చీఫ్ సెక్రటరిని కోరిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అటవీ శాఖ సంరక్షణలో ఉన్న భూమిని పర్యాటకశాఖకు కేటాయించాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్‌ను వినతిపత్రం ద్వారా కోరారు. బాపట్ల పర్యటనకు వచ్చిన చీఫ్ సెక్రటరిని మంగళవారం ఎమ్మెల్యే కలిసి వినతిపత్రం అందజేసి బాపట్ల అభివృద్ధి ప్రణాళిక గురించి వివరించారు. ముఖ్యంగా పర్యాటకశాఖకు భూములు కేటాయిస్తే సూర్యలంక పర్యాటక కేంద్రం అద్భుతంగా ఆవిష్కృతమౌతుందన్నారు. ఇప్పటికే సూర్యలంక అభివృద్ధి విషయంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.97 కోట్ల నిధులు కేటాయించటం జరిగిందని చెప్పారు. కర్లపాలెం మండలం కట్టవాద గ్రామంలో రాజుకాల్వపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించాలని, దీని ద్వారా 800 ఎకరాలు సాగు అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గంలో పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసే విషయమై చర్చించారు. సూర్యలంక పర్యాటక కేంద్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందించాలని కోరారు. పాండురంగాపురం నుంచి ఓడరేవు వరకు పర్యాటక కేంద్రం అభివృద్ధి చెందే అవకాశాలపై దృష్టిపెట్టాలని కోరారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలపై చీఫ్ సెక్రటరి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కేటాయించాలి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు దళితవాడలకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు రాలేదని ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక మంగళవారం రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్‌కు వినతిపత్రం ద్వారా వివరించారు. అదేవిధంగా గ్రామాలలో ఎక్కువ సమయం విద్యుత్‌కోత విధిస్తున్నట్లు తెలిపారు. దళిత కాలనీలలో శ్మశానవాటికలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పటంతో సత్కరించారు. కార్యక్రమంలో భీమ్ ఆర్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొచ్చెర వినయ్‌రాజు, పి.యోహాన్, మోజెస్, నాని, ఏసుబాబు తదితరులు ఉన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా, ఎరువులు : ఏవో

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఏవో బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ మండల పరిధిలోని 18 ఎరువుల దుకాణాల్లో యూరియా 530.405 టన్నులు, డీఏపీ 296.5 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 216.2 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. రైతుల అవసరాల మేరకు 120 టన్నుల యూరియా, 80 టన్నుల డీఏపీ అవసరమని ఉన్నతాధికారులకు సిఫారసు చేయడం జరిగిందన్నారు. ఎరువులను ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లయితే తమ దృష్టికి తీసుకు రావాలని ఏవో రైతులకు సూచించారు.

ప్రత్యేక అవసరాల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక అవసరాల గల పిల్లలకు అవసరమైన ఉపకరణాల నిర్ధారణ శిబిరం ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈవో దేవరాజ్ మంగళవారం తెలిపారు. సమగ్ర శిక్షా, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కొల్లూరులోని బీఎస్ఎఫ్ పాఠశాలలో నిర్ధారణ శిబిరం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. భట్టిప్రోలు, కొల్లూరు, వేమూరు, చుండూరు, అమృతలూరు మండలాల్లో గల ప్రత్యేక అవసరాల గల విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కుందేరువాగుకు మహర్దశ



ఎక్స్‌కవేటర్‌తో కుందేరు వాగును తవ్వుతున్న చిత్రం

బాపట్ల రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నో సంవత్సరాలుగా ఆక్రమణకు, పూడిపోయిన కుందేరువాగు మరలా పూర్వవైభవం వచ్చింది. బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ పేరలి డ్రెయిన్ వద్ద నుంచి ఉన్న కుందేరువాగు గతంలో సుమారు 50 అడుగులు వెడల్పుతో ఉండేది. దీనిని కుందేరు వాగు సమీపంలో ఉన్న పొలాల వారు ఆక్రమించుకుంటూ వాగు వెడల్పును తగ్గించేశారు. దీంతో కుందేరువాగు సమీప గ్రామాలవారు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. కుందేరువాగు ఉండటం వల్ల చుట్టు పక్కల గ్రామాలైన సుబ్బారెడ్డిపాలెం, వైఎస్సార్‌నగర్, నాగేంద్రపురం గ్రామాలలోని వర్షపునీరు నిల్వలేకుండా ఉపయోగకరంగా ఉంటున్నదని గ్రామాల ప్రజలు తెలిపారు. ఆక్రమణకు, పూడిపోయిన కుందేరువాగును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బాపట్ల మార్కెట్ యార్డు చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో పూడికతీత పనులు ప్రారంభించారు. దీంతో పడమర బాపట్ల పంచాయతీ గ్రామప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఇద్దరు డ్రైవర్లకు తీవ్ర గాయాలు

కశింకోట (అనకాపల్లి జిల్లా), జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముందు వెళుతున్న లారీని ఎడమ వైపు నుంచి అధిగమించే క్రమంలో రోడ్డు పక్కన ఆగి ఉన్న మరో లారీని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటన మంగళవారం ఉదయం బయ్యవరం వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో బాపట్ల డిపోకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు డ్రైవర్ షేక్ ఖాశీం, ఆప్షనల్ డ్రైవర్ డి.సుధాకరరెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. బస్సులో ఉన్న 16 మంది ప్రయాణికుల్లో తెనాలి నుంచి వస్తున్న అమ్మిరెడ్డి చౌడేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావులకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ ఖాశీంకు ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

ఆటో కార్మికులు సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన హిట్ అండ్ రన్ చట్టానికి వ్యతిరేకంగా మోటారు వాహనాల డ్రైవర్లు సంఘటితంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు నాగాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో లక్ష్మీగణపతి ఆటో ఓనర్స్ డ్రైవర్స్ యూనియన్ నూతనంగా నిర్మించిన యూనియన్ జెండా దిమ్మెను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా గతంలో ఆటోలు కొనుగోలు చేసేందుకు రాయితీపై రుణాలు మంజూరు చేయడం జరిగిందని, కానీ గత ఆరు సంవత్సరాలుగా కార్పొరేషన్ల ద్వారా రాయితీ రుణాల మంజూరు చేయకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షుడు కట్టా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రేపల్లె ఏరియా గౌరవ అధ్యక్షులు జి.బాలాజీ, నియోజకవర్గ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు, ఆటో కార్మిక సంఘం నాయకులు నాగూర్ మీరా, జగన్నాధం, వెంకటేశ్వరరావు, పీటర్‌పాల్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన డ్రైవర్లు దరఖాస్తు చేసుకోవాలి

రేపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : స్థానిక డిపోలో ఆన్‌లైన్ కాల్ డ్రైవర్లుగా విధులు నిర్వహించేందుకు ఆసక్తి గల డ్రైవర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు డిపో మేనేజర్ ఎస్.సునిల్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ హెవీ వెహికల్ లైసెన్స్‌పొందిన తరువాత కనీసం 18 నెలలు భారీ వాహనాలను నడుపుటలో అనుభవం కలిగిన వారు రేపల్లె డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి వైద్య పరీక్షలు, శిక్షణ అనంతరం ఆర్టీసీ బస్సులకు డ్యూటీలు కేటాయిస్తారని తెలిపారు.

పిల్లలకు పోషకాహారం అందించాలి

● చైల్డ్ అడ్వకేసి ఫోరం సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు

వేమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : చిన్న పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించాలని చైల్డ్ అడ్వకేసి ఫోరం సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు అన్నారు. ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామ బాలల రక్షణ కమిటీ, బాలల పంచాయతీ సంయుక్త అధ్యక్షతన మంగళవారం చావలి, బలిజేపల్లి, కోడిపర్రు, పెరవలిపాలెం, వేమూరు, జంపని, వరహాపురం, పోతుమర్రు గ్రామాల్లో బాలల స్నేహ న్యూట్రికిచెన్ గార్డెన్ విత్తనాలను పంపిణీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ, 14 రకాల విత్తనాలను ఈ సందర్భంగా సరఫరా చేయడం జరిగిందన్నారు. చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్, సీడీపీవో శ్రీలక్ష్మీ పాల్గొని తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ట్రస్ట్ ద్వారా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ అమృతవాణి, ప్రోగ్రాం మేనేజర్ శ్రీనివాస్, బాలల రక్షణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వీఆర్వో సుజాత, నాగభూషణం, కో ఆర్డినేటర్లు కీర్తన, సుధారాణి, సీఎల్‌పీ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

దర్శకుడు శ్రీనివాసయాదవ్‌కు సత్కారం

చెరుకుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం ఆరేపల్లికి చెందిన దర్శకుడు అచ్చన శ్రీనివాసయాదవ్‌ను మంగళవారం నరసరావుపేటలో జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు సత్కరించారు. శ్రీనివాసయాదవ్ ప్రస్తుతం సెటిల్మెంట్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో ఒక షెడ్యూల్‌ను చెరుకుపల్లి, నిజాంపట్నం, బాపట్లలో చిత్రీకరిస్తున్నట్లు ఆయన మంగళవారం చెరుకుపల్లిలో మీడియాకు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ దర్శకుడు దోనేపూడి దిలీప్‌రాజా పాల్గొన్నారు.







రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళి, మొక్కలు అందజేస్తున్న ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం

బాపట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం బాపట్ల కలెక్టరేట్‌కు వచ్చిన రాష్ట్ర చీఫ్ సెక్రటరి కె.విజయానంద్‌కు అధికారులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ జి.గంగాధర్‌గౌడ్, ఆర్డీవో పి.గ్లోరియా, తహసీల్దార్ షేక్ సలీమా, డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఏఎన్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలు, పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. బాపట్ల అభివృద్ధి ప్రణాళిక గురించి ఆయనకు వివరించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

కొల్లూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన ఐదుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మంగళవారం పంపిణీ చేశారు. మండల పరిధిలోని అనంతవరం గ్రామానికి చెందిన వీర్ల వీరయ్యకు రూ.4,05,341, బలిజేపల్లి శివశంకరరావుకు రూ.1,20,639, దావులూరి అన్నపూర్ణమ్మకు రూ.81 వేలు, జాలాది సాంబశివరావుకు రూ.50,700, గోళ్ళ పెద్ద శ్రీరాములుకు రూ.29,122 మొత్తం రూ.6,86,142 మంజూరు చేసి చెక్కుల రూపంలో ఎమ్మెల్యే కార్యాలయానికి పంపగా, గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు తమ కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.లక్ష విరాళం

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : అన్న క్యాంటీన్ నిర్వహణకు దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. సోమవారం రాత్రి ఐలవరంలో చేనేత వర్గాల వారికి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామానికి చెందిన మాచర్ల శివభాస్కరరావు అన్న క్యాంటీన్‌ల నిర్వహణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. టీడీపీ నాయకులు మాచర్ల నాగరాజు, దీపాల శివప్రసాద్, వామనపల్లి కోటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ ప్లస్‌గా గుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్

చెరుకుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ ప్లస్‌గా ఎంపికైన పాఠశాలల్లో గుళ్ళపల్లి జడ్పీ హైస్కూల్ జిల్లాలో ప్రథమస్థానంలో నిలవడంతో మంగళవారం డీఈవో పురుషోత్తం పాఠశాలను సందర్శించారు. క్లాస్ రూములను, ఆట స్థలాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఈవో పురుషోత్తం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్‌కి, మద్యానికి, ఫోన్లకి బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా స్కూల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ అసిస్టెంట్ ప్రోగ్రాం కమిషనర్ నాగిరెడ్డి, ఏపీవో శ్రీనివాస్, సమగ్రశిక్ష ఏపీసీ ఏఈ రాజేష్, ఎంఈవోలు లాజరు, నవీన్‌కుమార్, పాఠశాల హెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీఈవో పురుషోత్తం తదితరులు

అధిక ఎరువులతో తగ్గుతున్న భూసారం : ఏడీఏ

రేపల్లె, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్‌సీజన్‌లో రైతులు సరైన మోతాదులోనే ఎరువులను వాడాలని అధిక ఎరువులు వాడటం వలన పంట పొలాల నేల సారం తగ్గి పంట దిగుబడి తగ్గుతుందని వ్యవసాయశాఖ ఏడీఏ అద్దేపల్లి లక్ష్మి అన్నారు. మండలంలోని కారుమూరు గ్రామంలోని రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ, అనుబంధశాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పశువుల ఎరువులు, జీవన ఎరువుల వాడకం పెంచాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అంక సుబ్బారావు, బసవారావు, ఏఈవో సమంత్, వీఏఏ ఎస్.యశ్వని, ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ శాఖ ఏడీఏ అద్దేపల్లి లక్ష్మీ తదితరులు

పొన్నపల్లి, నడింపల్లి, గ్రామాలలో ...

చెరుకుపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం పొన్నపల్లి, నడింపల్లి, గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకం 2025కి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను వారి వేసిన రైతులందరూ ఎకరానికి రూ.800 ఆగస్టు 15వ తేదీలోపు టాటాఏఐజీ ఇన్సూరెన్స్ పేరున బీమాను బ్యాంకులలో గాని సీఎస్‌సీ సెంటర్‌లోగాని చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.ప్రియాంక, వీఆర్‌వో రమేష్, వీఏఏలు ప్రసాద్, అమూల్య, రైతులు పాల్గొన్నారు.

అద్దేపల్లి, ఐలవరంలో...

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రెండు గ్రామాల్లో నిర్వహించారు. మండల పరిధిలోని అద్దేపల్లి, ఐలవరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏవో బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ, వెద పద్ధతి వరి సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. 2025 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ క్రాప్ నమోదు మొదలవుతుందని ప్రతి రైతు రైతు సేవా కేంద్రాల ద్వారా పంట వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఏఈవో లక్ష్మీప్రసన్న, వీఏఏలు మహేంద్ర, ప్రవీణ్, ఎంపీఈవో భార్గవి, రైతులు పాల్గొన్నారు.

గణపవరం, పేరలి గ్రామాలలో...

కర్లపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ పంట నమోదు మొదలైందని, రైతులు తాము వేసిన పంట వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియపరచిన వెంటనే పంట నమోదు చేయించుకోవాలని ఏడీఏ రమాదేవి తెలిపారు. కర్లపాలెం మండలం గణపవరం, పేరలిలో మంగళవారం 'పొలంపిలుస్తుంది'లో ఆమె మాట్లాడుతూ కౌలు వ్యవసాయదారులు వ్యవసాయశాఖ ద్వారా అమలు అయ్యే పథకాలు వర్తించాలన్న పంటనమోదు చేసుకోవాలని, వ్యవసాయ రుణాలు పొందాలన్న కౌలు కార్డు తప్పనిసరి అని తెలిపారు.

మోపర్రు, వామనగుంటపాలెంలో...

అమృతలూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సాగు చేపట్టిన రైతులు తప్పని సరిగా తమ పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్‌భరత్‌కుమార్ కోరారు. మండల పరిధిలోని మోపర్రు, వామనగుంటపాలెం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ 2025 పంట నమోదు ప్రక్రియ ప్రారంభించడం జరిగిందన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని పంట బీమా చేయడం జరుగుతుందన్నారు.

నేడు అల్లూరు, ఖాజీపాలెంలో...

పిట్టలవానిపాలెం, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అల్లూరు, ఖాజీపాలెం, రైతుసేవా కేంద్రాలలో బుధవారం 'పొలం పిలుస్తోంది' జరుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి సీహెచ్ సత్యానంద్ తెలిపారు. ఆయా రైతు సేవా కేంద్రాలలో పొలంబడి కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అల్లూరులోని రైతుసేవ కేంద్రంలో ఉదయం 10 గంటలకు, ఖాజీపాలెంలో రైతు సేవ కేంద్రంలో 12గంటలకు జరుగుతాయని తెలిపారు.


గరుత్మంతస్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకస్వాములు


ప్రత్యేక పూజలందుకున్న గరుత్మంతస్వామి

భక్తిశ్రద్ధలతో గరుడపంచమి వేడుకలు

పొన్నూరు టౌన్, జూలై, 29(ఆంధ్రజ్యోతి) : పొన్నూరు పట్టణంలో వేంచేసియున్న గరుత్మంతస్వామి ఆలయంలో గరుడపంచమి వేడుకలు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. 26 అడుగుల ఏకశిల గరుత్మంతస్వామి విగ్రహానికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు జరిపారు. పట్టణంలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో ఉపాలయంగా వెలుగొందుతున్న గరుత్మంతస్వామి ఆలయంలో గరుడపంచమి వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి వందలాది లీటర్ల పాలు, పెరుగు, పంచామృతాలతో అభిషేకాలను కన్నులపండువగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు చేసి పుష్పయాగ కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన కళ్యాణ వేదికపై రుద్ర, శుక్రత సమేత గరుత్మంతస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలోనే తొలిదేవాలయంగా వెలుగొందుతున్న గరుత్మంతస్వామిని వీక్షించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ ఈవో గద్దె వెంకటఅమర్నాథ్ ఆధ్వర్యంలో ఉత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సోలార్ పవర్.. బీసీలకు బంపర్ ఆఫర్



❖ మూడు కిలోవాట్స్‌పై 98 వేలు సబ్సిడీ ❖ దరఖాస్తులు స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

వేమూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బీసీలకు మరో వరం ప్రకటించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ బిజిలి యోజన ద్వారా ఉచిత విద్యుత్ స్కీమ్‌లో భాగంగా బంపర్ ఆఫర్‌తో రాయితీలు ప్రకటించింది. ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.30 వేలు, రెండు కిలోవాట్స్‌పై రూ.60 వేలు, మూడు కిలోవాట్స్‌పై రూ.78 వేలు రాయితీలు ప్రకటించింది. తద్వారా బీసీలకు అధికంగా సబ్సిడీ పొందే అవకాశం లభించింది. ముఖ్యమంత్రి సౌరవిద్యుత్ విషయంలో కొన్ని కీలక ప్రకటనలు చేస్తూ ప్రతి నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై రూఫ్ టాప్ సోలార్ ప్యానల్స్ ఏర్పాటు జరపాలని ఎమ్మెల్యేలకు సూచించారు. ఈ మేరకు ట్రాన్స్ కో అధికారులు కూడా స్పందించి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్స్ వరకు విద్యుత్ ఉచితంగా పొందే సోలార్ సిస్టం ఏర్పాటుకు ప్రభుత్వమే నూరు శాతం రాయితీపై వాటిని ఏర్పాటు చేయడానికి దీనిని విస్తృతపరిచే ప్రక్రియలో భాగంగా ముఖ్యమంత్రి బీసీలకు ప్రత్యేకంగా సబ్సిడీని ప్రకటించారు. ఉదాహరణకు మూడు కిలోవాట్స్ సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ.2 లక్షల ఖర్చు అవుతుంది. అయితే ఆ మొత్తాన్ని దరఖాస్తు చేసుకున్న బీసీ వినియోగదారులకు ముందుగానే బ్యాంకు ద్వారా రుణం ఇప్పించడం జరుగుతుంది. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతితో రుణం పొందిన వారంలో గాని మీటరు ఏర్పాటు చేసిన అతి తక్కువ కాలంలోనే ప్లేట్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ట్రాన్స్ కో అధికారులు వినియోగదారులకు ఇంటింటి ప్రచారం ద్వారా తెలియజేస్తున్నారు. మూడు కిలోవాట్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేలు సబ్సిడీ అందించనుండగా కేంద్ర ప్రభుత్వం రూ.78 వేలు సబ్సిడీ ఇవ్వనుంది. దీంతో వినియోగదారునికి రూ.1.02 లక్షలకే సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకునే అవకాశం ఏర్పడుతుంది. సబ్సిడీ సొమ్మును వినియోగదారుని బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణానికి కేవలం రూ.50 పైసలు మాత్రమే వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది.

దరఖాస్తుల సేకరణకు గడువు లేదు

సబ్సిడీపై సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకోదలచిన బీసీ వినియోగదారులు దరఖాస్తు చేసుకునేందుకు గడువు లేదని నిరంతర ప్రక్రియగా పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని ట్రాన్స్ కో అధికారులు పేర్కొంటున్నారు.

యోగా పోటీలు ప్రారంభం

వివిధ రాష్ట్రాల నుంచి 278 మంది విద్యార్థుల హాజరు


గరుడ ఆసనాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ పరిధిలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థుల మూడు రోజుల ప్రాంతీయ యోగా ప్రదర్శన పోటీలు చిలకలూరిపేట మండలం మద్దిరాలలో ఉన్న జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిలకలూరిపేట మున్సిపల్ కమిషనర్ పీ శ్రీహరిబాబు యోగా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాధనం యోగా అని అన్నారు. మద్దిరాల నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు నవోదయ విద్యాలయాలలో కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కలలను సాకారం చేసుకోవాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథులుగా పాల్గొన్న ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ లింగయ్య చౌదరి, నవోదయ విశ్రాంత సహాయక కమిషనర్ ప్రభాకరరెడ్డి యోగా ప్రాముఖ్యత గురించి వివరించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక నవోదయ విద్యాలయ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సౌకర్యమున్నా.. ఆదరణ సున్నా

నాగిరెడ్డిపల్లిలో సూపర్‌ఫాస్టు రైలు ఆగుతున్నా సున్నా రిజర్వేషన్ ● రోజుకు కనీసం ఐదుగురు కూడా ప్రయాణించడం లేదు ● కాగ్ ఆడిటింగ్ చేస్తే అధికారులకు ఇబ్బందే

గుంటూరు రైల్వేడివిజన్‌లో కొన్ని రైల్వే స్టేషన్లు గుదిబండలా మారాయి. వాటిల్లో రోజుకు కనీసం ఐదుగురు ప్రయాణీకులు కూడా రైళ్లలో ప్రయాణించడం లేదు. పైగా ఈ స్టేషన్లు బ్రాంచ్ లైన్లలో లేవు. మెయిన్‌లైన్లలో ఉన్నా ఆదరణ లేకపోవడం ఆందోళన కలిగిస్తోన్నది. ఈ నేపథ్యంలో కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ గుంటూరు రైల్వేడివిజన్‌లో ఆడిట్ చేస్తే మాత్రం ఆయా స్టేషన్లలో రైళ్లు ఆగేందుకు జస్టిఫికేషన్ ఇచ్చిన అధికారుల మెడకు చుట్టుకోవడం ఖాయం. అలానే రెవెన్యూ రికవరీ కూడా ఆదేశాలు జారీ చేసే అవకాశం లేకపోలేదు.

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నడికుడి - పగిడిపల్లి మధ్యన కొన్ని రైల్వేస్టేషన్లు ఉన్నాయి. వీటిల్లో ఎక్కువగా మెమూ రైళ్లకు స్టాపేజ్ సౌకర్యం ఉన్నది. పొందుగల రైల్వేస్టేషన్ ఊరికి చాలాదూరంగా అడవిలో ఉన్నట్లు ఉంటుంది. ఈ కారణంగా దీనికి అసలు ప్యాసింజర్ అవుట్‌వర్డ్ ట్రాఫిక్ ఉండటం లేదు. ఏడాది లెక్కలు తీస్తే కేవలం 122 మంది ప్రయాణికులు మాత్రమే ఇక్కడ టిక్కెట్‌లు కొనుగోలు చేసి ప్రయాణించారు. దీనిని పరిగణనలోకి తీసుకొంటే రోజుకు కనీసం ఒక్కరు కూడా ప్రయాణం చేయలేదు. శ్రీరాంపురం రైల్వేస్టేషన్‌లో కేవలం 411 మంది ప్రయాణించారు. ఈ రైల్వేస్టేషన్‌లో రోజుకు సగటున ఇద్దరు కూడా ప్రయాణించలేదు. వలిగొండ రైల్వేస్టేషన్‌లో ఏడాదిలో మొత్తంగా 1117 మంది రైలులో ప్రయాణం చేశారు. రోజుకు ముగ్గురు కూడా రైళ్లు ఎక్కలేదు. అయినప్పటికీ మెమూ రైళ్లను నడుపుతున్నారు. దీనివలన ఆపరేషనల్ సమస్యలే కాకుండా రెవెన్యూ పరంగానూ లోటు ఏర్పడుతున్నది.



నాగిరెడ్డిపల్లి రైల్వేస్టేషన్‌లో అయితే పల్నాడు సూపర్‌ఫాస్టు ఎక్స్‌ప్రెస్‌కు స్టాపేజ్ ఉన్నది. అయినప్పటికీ ఇక్కడ రిజర్వేషన్ టిక్కెట్‌లు ఒక్కటి కూడా బుకింగ్ కావడం లేదు. చిట్యాలలోనూ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కి నిలుపుదల సౌకర్యం ఉన్నది. ఇక్కడ ఏడాది పొడవునా చూస్తే 740 మంది రిజర్వు చేసుకొన్నారు. రైల్వే నిబంధనల ప్రకారం ఏదైనా రైల్వే స్టేషన్‌లో రైళ్లను నిలుపుదల చేయాలంటే కనీసం 50 టిక్కెట్‌లు రోజుకు సగటున బుకింగ్ జరగాలి. దీనిని పరిగణనలోకి తీసుకొంటే ఏడాదిలో 18250 టిక్కెట్‌లు కనీసం బుకింగ్ జరగాలి. ఈ లెక్కన పొందుగల, శ్రీరాంపురం, వలిగొండ, తిప్పర్తి, చిట్యాలలో కనీసం కంటే చాలా తక్కువగా టిక్కెట్‌లు బుకింగ్ జరుగుతున్నాయి. అయినప్పటికీ ఏ కారణం చేతనో రైల్వే అధికారులు వాటిల్లో స్టాపేజ్‌లను కొనసాగిస్తున్నారు. ఇటీవల కాగ్ చెన్నై - ఎస్ఎస్‌పీఎన్ రైలు విషయంలో కేవలం రెండు శాతం ఆక్యుపెన్సీతో నడుపుతున్నారని తప్పు పట్టింది. అందుకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఉన్నతాధికారులు ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోకపోతే అలాంటి పరిస్థితే గుంటూరు రైల్వే డివిజన్‌లోనూ తలెత్తే అవకాశం లేకపోలేదు.

గాలిలో నాణ్యతను పెంపొందించాలి

జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు నిర్వహించాలి

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో కలెక్టర్ ఆదేశాలు

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు, గుంటూరు నగరంలో గాలి నాణ్యతను పెంపొందించేందుకు జాతీయ క్లీన్ ఎయిర్ కార్యక్రమాలు సంబంధిత శాఖలు పకడ్బందీ ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ అమలు కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పదేళ్లలో గాలిలో కాలుష్యాన్ని 70 నుంచి 80 శాతం వరకు తగ్గించే లక్ష్యంతో కాలుష్యాన్ని తగ్గించి పచ్చదనం పెంచే కార్యక్రమాలకు నిధులు మంజూరవుతున్నాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గుంటూరు కార్పొరేషన్ రూ.2.73 కోట్ల అంచనాతో ప్రతిపాదించిన పనులను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పూర్తి చేయాలన్నారు. జీజీహెచ్, ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఉన్న నేషనల్ ఎయిర్ మానిటరింగ్ ప్రోగ్రాం ద్వారా ఏర్పాటు చేసిన స్టేషన్లను ప్రత్యామ్నాయ ప్రాంతాలకు మార్చాలన్నారు. జిల్లాలో తెనాలి, పొన్నూరు పరిసర ప్రాంతాల్లో వ్యవసాయ, పశువుల వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు నెడ్ క్యాప్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు ఎండీ నజీనబేగం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజరు జయలక్ష్మి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(ఇన్చార్జి) చంద్రముని, నగరపాలక సంస్థ ఈఈ సుందరరామిరెడ్డి, ఎంవీఐ మల్లేశ్వరి, ఆర్టీసీ కమర్షియల్ మేనేజరు ఆర్వీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్


మూడు లేన్లుగా విస్తరించే గుంటూరు ఆర్వోబీ

ఆర్వోబీల విస్తరణకు రూ.54 కోట్లు

● ఎన్‌హెచ్-16పై రెండు చోట్ల మూడు లేన్లుగా మార్పు ● కొలనుకొండ, గుంటూరు ఆర్వోబీలకు కేంద్రం నిధులు

గుంటూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని జాతీయ రహదారి ఎన్‌హెచ్ 16పై రెండు ఆర్వోబీల విస్తరణకు ముందడుగు పడింది. ఎన్‌హెచ్ 16 మూడు లేన్లుగా మారినా రెండు చోట్ల ఆర్వోబీల వద్ద మాత్రం రెండు లేన్లుగానే ఉంది. ఈ ఆర్వోబీల వద్ద దశాబ్దాల తరబడి రోడ్డు ఇరుకుగా ఉంది. 40 కిలోమీటర్ల వ్యత్యాసంలో గుంటూరు, విజయవాడ వంటి రెండు పెద్ద నగరాలు ఉండడం.. ఈ మధ్య లోనే ఆర్వోబీల వద్ద హైవే ఇరుకుగా ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకుని రెండు ఆర్వోబీల విస్తరణకు రూ.54 కోట్లు మంజూరు చేసిం ది. తాడేపల్లి మండలం కొలను కొండ వద్ద ప్రస్తుత డీజీపీ కార్యాలయానికి సమీపంలోని ఆర్వోబీ వద్ద నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతూ ఉంటుంది. రోడ్డంతా మూడు లేన్లుగా ఉంటూ, ఒక్కసారిగా ఆ ఆర్వోబీ దగ్గర రెండు లే న్లుగా కుదించుకుపోయి ఉండడంతో ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ వంతెన విస్తరణకు రూ.36 కోట్లు కేటాయింపుతో దశాబ్దకాలానికి పైగా ఉన్న సమస్యకు చెక్ పడనున్నది.

గుంటూరులో బుడంపాడు ఫ్లై ఓవర్‌కు సమీపంలో గుంటూరు, తెనాలి రైల్వే ట్రాకుపై విజయవాడ నుంచి చెన్నై వైపు వెళ్లే రోడ్డుపై ఆర్వోబీ మూడు లేన్లుగా, చెన్నై నుంచి విజయవాడ వైపు వెళ్లే రోడ్డులో రెండు లేన్లుగా ఉంది. ఇప్పుడు ఈ రెండు లేన్ల వంతెనను మూడు లేన్లుగా విస్తరించేందుకు కేంద్రం రూ.18 కోట్లు కేటాయించింది. రెండేళ్లలో ఈ రెండు ఆర్వోబీలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎన్‌హెచ్ఏఐ అధికారులు చెబుతున్నారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి


సాగర్‌లో సందడి చేస్తున్న పర్యాటకులు

విజయపురిసౌత్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి భారీగా వరద వస్తుండడంతో సాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్‌గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 2,04,048 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పర్యాటకులు భారీగా సాగర్‌ను సందర్శించారు. సాగర్‌లోని నూతన బ్రిడ్జి, పడిపోయిన బ్రిడ్జి, పుష్కరఘాట్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా పర్యవేణలో విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ ఆధ్వర్యాన పర్యాటకులు రద్దీగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


విద్యుత్ వెలుగుల్లో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్

అనధికార లే అవుట్ క్రమబద్ధీకరణకు అవకాశం

● కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్‌లు, ప్లాట్‌లు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు ఒంగోలు నగర కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఎల్ఆర్ఎస్‌స్కీమ్-2020ను పొడిగిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో 2025 జూన్ 30కు ముందు వేసిన అనధికార లే అవుట్‌లు, ప్లాట్‌లు, నిర్ణీత అపరాధ రుసుము 14% ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. జూలై 26వ తేదీ నుంచి 90 రోజులలోపాటు దరఖాస్తులను అపరాధ రుసుంముతో చెల్లించి ఆన్‌లైన్‌లోని ఎల్ఆర్ఎస్ వెబ్‌సైట్‌లో దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. కార్పొరేషన్ ద్వారా అనుమతి పొందిన లైసెన్స్ సర్వేయర్, లైసెన్స్ ఇంజనీర్, స్ట్రక్చర్ ఇంజనీర్‌లు, ఆర్కిటెక్‌లచే అనధికార లే అవుట్, నాన్ లే అవుట్‌లో ఉన్న స్థలాలు, ప్లానులు తయారుచేయించుకొని, 50 శాతం అపరాధ రుసుంతో, 14 శాతం ఓపెన్ స్పేస్ ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో క్రమబద్ధీకరించుకోవాలని కమిషనర్ తెలిపారు. లేనిపక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలి

● వెలుగు పీడీ నారాయణ

ఒంగోలు నగరం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): డీఆర్‌డిఏ, వెలుగు శాఖల ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల లక్ష్యాలను చేరుకోవాలని పీడీ నారాయణ కోరారు. మంగళవారం ఒంగోలులోని వెలుగు టీటీడీసీ భవనం సమావేశం హాలులో జరిగిన 38 మండలాల కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, డీపీఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్రోక్రెడిట్ ప్లాను కింద రుణాలకు సంబంధించి ల బ్ధిదారుల వివరాలను బ్యాంకులకు పంపించాలని కోరారు. బ్యాంకు లింకేజీ రుణాలు అర్హత ఉన్న ప్రతి సంఘానికి అందేలా చూడాలన్నా రు. జిల్లాలోని పొదుపు సంఘాలను పటిష్టపరిచే దిశగా క్రమ తప్ప కుండా సంఘాల సమావేశాలు జరిగేలాచూడాలన్నారు. సమావేశం లో స్త్రీనిధి డీజీఎం ఉమామహేశ్వరరావు, డీపీఎం దానం, ఫైనాన్స్ డీపీఎం కృపారావు, ఐబి డీపీఎం రజనీకాంత్, ఏపీఎంలు ఆదిశేషు, సు బ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య

దర్శి, జూలై 29(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలోని లంకోజనపల్లి రో డ్డులో నివసిస్తున్న మాడపాకుల ఐశ్వర్య(20) సోమవారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బొ ట్లపాలెం గ్రామానికి చెందిన ఐశ్వర్యకు 2023 సంవత్సరంలో దర్శి ప ట్టణానికి చెందిన రావులపల్లి వంశీతో వివాహమైంది. కొంతకాలం నుం చి పుట్టింటి నుంచి డబ్బులు తీసుకురావాలని భర్త వేధింపులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. బొట్లపాలెంలో పుట్టింటి వారు ఇచ్చిన స్థలాన్ని అమ్మి డబ్బులు తేవాలని నిత్యం వేధిస్తున్నాడు. దీంతో ఆమె మన స్తాపం చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆ త్మహత్య చేసుకుంది. ఆ సమయంలో భర్త వంశీ టైలరింగ్ పనికోసం బయటకు వెళ్లాడు. సమాచారం అందుకున్న డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, ఎస్ఐ ఎం.మురళి సంఘటనా స్థలాన్ని పరి శీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర బృందం పరిశీలన

ముండ్లమూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్ శర్మ, నందలాల్ గుల్జార్ అన్నారు. మండ లంలోని పూరిమెట్ల, భీమవరం గ్రామాల్లో వారు మంగళవారం పర్య టించారు. డ్వాక్రా సభ్యులతో మాట్లాడారు. ఉపాధి హామీ ద్వారా చేప ట్టిన నీటి తొట్లు, ఫారంపాండ్స్ కుంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎం పీడీవో ఎం.శ్రీదేవి, ఏపీడీలు లక్ష్మీరెడ్డి, బసవ సుబ్బరావు, ఏపీవో టి.వెం కటరావు, ఏఈలు ఎం.వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ ఒగులూ రి రామాంజీ, అబ్బూరు గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

సమానత్వం కోసం సమరశీల ఉద్యమాలు

కొండపి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : మహిళా సమానత్వం కోసం సమరశీల ఉద్యమాలు నిర్మించాల్సిన అవసరం పెరిగిందని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి పిలుపునిచ్చారు. మంగళవారం పెరిదేపిలోని ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘ 4వ మండల మహాసభలో ఆమె మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. పోరాటాల ద్వారానే వరకట్న వ్యతిరేక చట్టం, గృహ హింస వ్యతిరేక చట్టం, పోక్సో, నిర్భయ చట్టాలను సాధించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకురాలు మ ల్లెల సింగమ్మ, ఎం.సంపూర్ణ, అంజమ్మ, సుజాత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్షురాలుగా అంగలకుర్తి మాధవి, కార్యదర్శిగా ఎ.విశ్రాంత, ఉపాధ్యక్షురాలిగా నిర్మల, సహాయ కార్యద ర్శిగా లక్కెపోగు నిర్మల, కోశాధికారిగా సౌజన్యను ఎన్నుకున్నారు.

విజేతకు బహుమతి ప్రదానం

మద్దిపాడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లిలో జరుగుతున్న ఎడ్ల బండ లాగుడు పందెంలో భాగం గా మంగళవారం ప్రథమ విజేత, స్థానికుడైన తాడి బోయిన శ్రీనివాసరావుకు టీ డీపీ నాయకుడు పోతినేని శ్రీనివాసరావు రూ.15వేల న గదు బహుమతిని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎడ్ల పందేలు నిర్వహించడం ఎంతో సంతోషదాయకమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముచ్చు సుబ్బారావు, గడ్డం రవి, ప్రధాన కార్యదర్శి మందపల్లి శ్రీనివాసరావు గట్టినేని అయ్యన్న, దుగ్గినేని నరసింహారావు, కారుమూడి చింపి రయ్య, దుంప కృష్ణమోహన్‌రెడ్డి, రాయపాటి శ్రీనివాసరావు, సుబ్బారావు, నవు లూరి శివకృష్ణ, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోలు.. ఏరి?

(5వ పేజీ తరువాయి)

వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని జడ్పీ, మండల పరిషత్, ప్రాథమికోన్నత, ఎయిడెడ్ పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత ఎంఈవోలదే. ఇంతటి కీలకమైన ఎంఈవోల నియామకంపై అధికారు లు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నా యి. అనేక మండలాల్లో ఇన్‌చార్జిలుగా సమీప మండలాలు ఎంఈవోలు లేదంటే ఉన్నత పాఠశాలల్లో సీనియర్‌గా ఉన్న ప్రధానోపాధ్యాయులకే ఆ బాధ్యతలు అప్పగిస్తున్నారు. దీంతో ఇన్‌చార్జి బాధ్యతలకు వారు న్యాయం చేయలేక పోతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అయితే ఒకరిద్దరు ఎంఈవోలు నాలుగైదు మండలాల్లో పాఠశాలలను తనిఖీ చేయాల్సి వస్తోంది. దీంతో పాఠశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నా యి. నెలలో కనీసం పది రోజుల పాటు ఉపాధ్యాయుల జీతాల బిల్లులు చేసే బాధ్యత ఎంఈవోలదే. కొరత నేపథ్యంలో ఉపాధ్యాయుల బిల్లుల అప్‌లోడ్‌లో కూడా జాప్యం జరుగుతుందని ఉపాధ్యాయులు, సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పలువురు ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఉద్యోగోన్నతులతో ఎంఈవో పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నా విద్యాశాఖాధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ఇద్దరి పని ఒక్కరే..

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో అనేక మండలాల్లో ఎంఈవోలు లేరు. అయితే కొన్ని మండలాలకు ఇద్దరు ఎంఈవోలు ఉన్నా పరిస్థితిలో మార్పులేదు. ఒకరు కార్యాలయంలో పరిపాలనలో నిమగ్నం కాగా మరొకరు పర్యవేక్షణకు వెళ్లాల్సి వస్తుంది. అనేక మండలాల్లో ఇద్దరు ఎంఈవోలు లేరు ఒకవైపు పర్యవేక్షణ, మరోవైపు కార్యాలయంలో విధులు నిర్వహణ ఒకరే చూడాల్సి వస్తోంది. మరోవైపు డిప్యూటీ డీఈవోలు కూడా ఎంఈవోల బాధ్యతలు నిర్వహించాల్సి వస్తోంది. నరసరావుపేట డిప్యూటీ డీఈవో నరసరావుపేట మండలాన్ని పర్యవేక్షిస్తున్నారు. సత్తెనపల్లి డిప్యూటీ డీఈవోకు అదనపు బాధ్యతలు ఉన్నాయి. గుంటూరు డిప్యూటీ మేడికొండూరు మండల ఎంఈవో బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తెనాలి డిప్యూటీ డీఈవో తాడేపల్లి ఎంఈవోగా ఇన్చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంకా రాజుపాలెం, నగరం, అమృతలూరు, పెదనందిపాడు, పెద్దకూరపాడు, అమరావతి తదితర మండలాలు ఇన్‌చార్జి ఎంఈవోల పాలనలోనే కొనసాగుతున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రకాశం జిల్లాలోని ఎర్రగొండపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుల్లలచెరువు, వెల్దుర్తి మండలాలను పర్యవేక్షించాల్సి వస్తుంది. ఇప్పటికైనా ప్రధానోపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు కల్పించి పూర్తిస్థాయి ఎంఈవోలుగా నియమించాలని విజ్ఞప్తులు వస్తున్నాయి.

కొండపి పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

● సర్పంచ్‌తోపాటు అన్ని వార్డుల్లో గెలవాలి
● మంత్రి శ్రీబాలవీరాంజనేయస్వామి
● టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా

టంగుటూరు (కొండపి), జూలై 29 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం తూర్పునాయుడుపాలెంలోని తన కార్యాలయంలో కొండపి గ్రామ పంచాయతీలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. 14 ఏళ్ల తర్వాత జరుగుతున్న పంచాయతీ ఎన్నికలను పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నదన్నారు. సర్పంచ్ పదవితోపాటు, 14 వార్డులను కైవసం చేసుకునే విధంగా కేడర్ పనిచేయాలని సూచించారు. సర్పంచ్‌గా అందరికీ ఆమోదయోగ్యమైన వ్యక్తిని నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చి సూచించాలని మంత్రి కోరారు. 14 వార్డులకు మంచి అభ్యర్థులను రంగంలోకి దించడంతోపాటు డమ్మీ అభ్యర్థులను ఎంపిక చేసి వారితో కూడా నామినేషన్లు వేయించాలన్నారు. వీరి పేర్లను వెంటనే ఫైనల్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో కొండపి నాయకులు నన్నూరి సుబ్బరామయ్య, బూదవాటి సోమయ్య, కట్టావారిపాలెం నాయకులు మానికొండ వెంకటేశ్వర్లు, రావెళ్ల రఘునాథ్‌బాబు, అనుమాల ప్రసాద్, మాజీ సర్పంచ్ యనమద్ది మల్లికార్జున, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ సభ్యుడు యనమద్ది వెంకటేశ్వర్లు, దాసరెడ్డిపాలెం, ముక్కోడిపాలెం నాయకులు పాల్గొన్నారు.

● అభ్యర్థులపై ఇరు పార్టీల కసరత్తు

కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నాయకులు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు ప్రారంభించారు. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మంగళవారం సాయంత్రం కొండపిలోని పార్టీ కార్యాలయంలో నాయకులతో సమాలోచనలు చేశారు. వార్డు సభ్యుల ఎంపికను వెంటనే పూర్తిచేయాలని నాయకులకు సూచించారు. వైసీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ కూడా పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించి నాయకులకు పలు సూచనలు చేశారు.

ఉత్సాహంగా రీజనల్ బాక్సింగ్ పోటీలు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు జవహర్ నవోదయలో రీజనల్ స్థాయి బాక్సింగ్ పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈనెల 29 నుంచి 31వ తేదీ వరకు జరిగే పోటీలను జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, అండమాన్ అండ్ నికోబార్, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని నవోదయ విద్యాలయాల్లో చదువుతున్న బాల, బాలికలు పాల్గొంటున్నారని ప్రిన్సిపాల్ మనీష్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

రైలులో విలువైన వస్తువులు చేజార్చుకున్న ప్రయాణికురాలు

● అప్రమత్తమై యజమానికి వస్తువులు అప్పగించిన రైల్వే పోలీసులు



యజమానురాలికి వస్తువులు అప్పగిస్తున్న కానిస్టేబుల్ శేషయ్య

చీరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైలులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు విలువైన వస్తువులను చేజార్చుకుంది. దీంతో అప్రమత్తమైన తెనాలి రైల్వే పోలీసులు యజమానికి సురక్షితంగా అప్పగించారు. వివరాల్లోకి వెళితే గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ఉపాధ్యాయిని రంగనాయకి గతకొద్ది రోజుల క్రితం సికింద్రాబాదులోని బంధువులకు వద్దకు వెళ్లారు. తిరిగి మంగళవారం ఉదయం సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో తెనాలికి చేరుకున్నారు. అయితే లగేజీ మరచి రైలు నుండి దిగేశారు. రైలు దిగి పరిశీలించుకుని వెంటనే తెనాలి రైల్వే పోలీసులను ఆశ్రయించడంతో అప్పటికే విధులు ముగించుకుని చీరాలకు వెళుతున్న రైల్వే కానిస్టేబుల్ తేళ్ల శేషయ్యకు సమాచారం చేర వేశారు. దీంతో శేషయ్య అప్రమత్తమై ఎమ్ 23లోని ఆమె బెర్త్ వద్దకు చేరుకుని లగేజీను స్వాధీనం చేసుకున్నారు. చీరాలకు పిలిపించి లగేజీ అందజేశారు. అందులో విలువైన 5 క్రెడిట్ కార్డ్స్, 5 డెబిట్ కార్డ్స్, కొంత నగదు ఉన్నాయి. దీంతో యజమానురాలు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగుల జీవితాల్లో వెలుగు నింపిన నకారా



నకారా విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులు

అద్దంకిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉద్యోగు జీవితాలల్లో వెలుగు నింపిన పెన్షన్ పితామహుడు డీఎస్ నకారా అని రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యు.దేవపాలన అన్నారు. మంగళవారం అద్దంకిలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో డీఎస్ నకారా వర్ధంతి కార్యక్రమం సంఘ అధ్యక్షుడు ఏ.అనంత కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నకారా విగ్రహానికి సంఘ సభ్యులు పులమాలలు వేసి నివాళ్లుర్పించారు. నకారా సేవలను సంఘ సభ్యులు కొనియాడారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎన్.శంకరరెడ్డి సంఘానికి రూ.20వేల విలువైన కంప్యూటర్, సీపీయూను అందజేశారు.



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే

పెన్‌కాక్ సిలాట్ విజేతలకు అభినందనలు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పెన్‌కాక్ సిలాట క్రీడలో విజేతలను ఒంగోలులో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ అభినందించారు. ఈనెల 19, 20 తేదీలలో తమిళనాడులోని తిరుచురాపల్లిలోని కొంగునాడు ఇంజనీరింగ్ కాలేజీలో జరిగిన 6వ సౌత్‌జోన్ పెన్‌కాక్ సిలాట్ పోటీలలో రాష్ట్ర వ్యాప్తంగా 110 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఒంగోలుకు చెందిన క్రీడాకారులు ద్వితీయ స్థానంలో విజేతలుగా నిలిచి బంగారు, సిల్వర్ పతకాలు సాధించారు. ఈ సందర్భంగా క్రీడాకారులు వి.మునిశేఖర్‌రెడ్డి, డి.శశిందర్, సయ్యద్‌ఖాదర్‌హుస్సేన్, కె.హేమంత్‌రెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, పి.తరుణ్‌కుమార్, డి.కళావతి, కె.సాయిరామ్, డి.నాగేంద్రబాబులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో పెన్‌కాక్ సిలాట్ డైరెక్టర్ ఐ.వరప్రసాద్, కోచ్, ప్రధాన కార్యదర్శి పి.మనోజ్ సాయి, జిల్లా జాయింట్ సెక్రటరీ అడపాల వెంకటేశ్వర్లు, పోతంశెట్టి దుర్గ, 44వ డివిజన్ టీడీపీ కార్యదర్శి డి.నారాయణ, బూత్ కన్వీనర్ ఎస్.శ్రీనివాస్.వి. చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సి.నారాయణరెడ్డికి నివాళి

మద్దిపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి సి.నారాయణరెడ్డి సేవలు అజరామరమని విశ్రాంత ఉద్యోగులు సంఘ నాయకులు కాకుమాను సుబ్బా రావు అన్నారు. మంగళవారం మద్దిపాడులోని నటరాజ కళాకేంద్రంలో విశ్రాంత ఉద్యోగులు సి.నారాయణరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం లో గంగిశెట్టి నరసింహారావు, గంటా కోటేశ్వరరావు, బడితల వెంకటేశ్వర్లు, పీ వీ.రాఘవరావు, కటకం వెంకటేశ్వర్లు, షేక్ కలాం, షరీఫ్ పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన పెంచుకోవాలి

● డీఆర్వో చినఓబులేషు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చినఓబులేషు

ఒంగోలు కలెక్టరేట్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సమాచారహక్కు చట్టంపై పట్టుపరిశ్రమ శాఖ ఉద్యోగులు సంపూర్ణ అవగాహన పెంపొందించుకోవాలని డీఆర్వో చినఓబులేషు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం జిల్లా పట్టుపరిశ్రమశాఖ ఉద్యోగులకు సమాచార హక్కు చట్టం-05పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మా ట్లాడారు సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులకు సకాలంలో వివరాలు అందజేయాలని సూచించారు. జిల్లా పట్టు పరిశ్రమ అధికారి డాక్టర్ పి.సుజయ్‌కుమార్ సర్టిఫైడ్ కాపీలకు రుసుం, జాప్యం జరిగితే చెల్లించాల్సిన జరిమానా తదితర అంశాలను వివరించారు. సాధారణ పౌరుడిగా ఈ చట్టంపై ప్రతి ఉద్యోగి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్ర భుత్వకార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల ఉద్యోగి సహృదయతో గౌరవించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-పంటలో నమోదు చేసుకోవాలి

సంతనూతలపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.వేములపాడు, మద్దులూరు గ్రామాల్లో మగంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పా వని మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటలను ఈ-ప ంటలో నమోదు చేసుకోవాలని తెలిపారు. పంటలకు ప్రీమియం చె ల్లిస్తే నష్ట పరిహారం లభించే అవకాశం ఉందని చెప్పారు.

యాదవ భవన్ స్థలాన్ని ఇతరులకు కేటాయించొద్దు

● ఎమ్మెల్యే దామచర్లకు వినతి



ఎమ్మెల్యే దామచర్లకు వినతిపత్రాన్ని అందజేస్తున్న యాదవులు

ఒంగోలు కార్పొరేషన్, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): పెళ్ళూరు గ్రామ సర్వే నెం.78/1లోని 19 డివిజన్‌లో యాదవ భవన్ నిర్మాణానికి మంజూరు చేసిన 0.70 సెంట్లు స్థలాన్ని ఇత ర శాఖలకు కేటాయించవద్దని ఆలిండియా యాదవ మహాసభ నాయకులు ఎమ్మెల్యే దా మచర్ల జనార్దన్‌ను కోరారు. ఈ మేరకు మం గళవారం ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయ ంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజే శారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది యాదవుల కోసం శ్రీకృష్ణ కళ్యా ణ మండపం, యాదవ్ భవన్ నిర్మాణానికి ఆ స్థలం కేటాయించడంతోపాటు, నిబంధనల ప్రకారం కౌన్సిల్ తీర్మానం కూడా జరిగిందని తెలిపారు. కాగా యాదవ సామాజిక వర్గం అవసరాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం ఇచ్చిన స్థలంలో ఇతర శాఖలు ఎలాంటి ని ర్మాణాలు చేయకుండా చూడాలని విన్నవించా రు. అలాగే మేయర్ గంగాడ సుజాతను క లిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కఠారి శంకర్, యనమల నాగరాజు, జడా వెంకటేష్, చల్లా తిరుమలరావు, తిప్పరమల్లి రవితేజ, కండే స్వాతి, అంగిరేకుల గురవయ్య, గండు ధనలక్ష్మి, ఎందేటి పద్మ తదితరులు పాల్గొన్నారు.



కుటుంబ స్థితిగతులు తెలుసుకుంటున్న ఎంపీడీవో

పేదల ఆర్థిక అభివృద్ధికి సహకారం అందిస్తాం

● ఎంపీడీవో వెంకటరామిరెడ్డి

రాచర్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పీ 4 కుటుంబాల ఆర్థిక అభివృద్ధికి సహకారం అందిస్తామని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి చెప్పారు. మండలంలోని జేపీచెరువు చెంచు గూడెంలోని కుటుంబాలను మంగళవారం ఆయన సందర్శించారు. పీ4లో భాగంగా ప్రతి పేద కుటుంబం ఆర్థిక అభివృద్ధి చెందాలని ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని అందుకొరకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించిందని ఆ కార్యక్రమాల ద్వారా ప్రతి నిరుపేద కుటుంబానికి సంపూర్ణ సహకారం అందించి వారి అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. గూడెంలో ఉన్న సమస్యలు, ఇబ్బందులు, కుటుంబ ఆర్థిక స్థితిగతులు, తదితర విషయాల గురించి ఆయన వారిని అడిగి తెలుసుకున్నారు. ఈఓఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి వీరగరుడు, పార్టీ అధ్యక్షులు ఎం తిరుపాల్ యాదవ్, నాయకులు బొల్లవరం ఆదినారాయణ ఉన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను రక్షించిన పోలీసులు

మేదరమెట్ల, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్య చేసుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళను మేదరమెట్ల పోలీసులు రక్షించి కుటుంబ సభ్యులకు మంగళవారం అప్పజెప్పారు. మేదరమెట్లకు చెందిన 25 సంవత్సరాల అవివాహిత ప్రేమించిన వ్యక్తిని వివాహం చేసుకోవడానికి కుటుంబ సభ్యులు అంగీకరించకపోవడంతో సూసైడ్ నోటు రాసి సెల్‌ఫోను ఇంటిలో వదలి సోమవారం ఇంటి నుంచి వెళ్లి పోయింది. సూసైడ్ నోట్ చూసిన తల్లిదండ్రులు మేదరమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో మేదరమెట్ల ఎస్ఐ మహమ్మద్ రఫీ మహిళ కోసం విస్తృతంగా గాలించారు. విజయవాడ బస్టాండ్‌లో ఆమెను గుర్తించి అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మేదరమెట్ల పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డ్యూడీ మాట్లాడుతూ క్షణిక ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు జీవితాంతం బాధను మిగిలుస్తాయని అన్నారు. ప్రేమ, పెళ్లి వంటి కీలక నిర్ణయాలు ఒక్క క్షణంలో తీసుకునే అంశాలు కావన్నారు.

లారీ ప్రమాదంలో కూలీ మృతి

సింగరాయకొండ, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తూ జరిగిన లారీ ప్రమాదంలో దినసరి కూలీ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని కలికివాయి పంచాయతీ పరిధిలోని బీకేటీ ఫ్యాక్టరీలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. టంగుటూరు మండలం జమ్ములపాలేనికి చెందిన నన్నూరి వెంకటేశ్వరు (46) బీకేటీలో దినసరికూలీగా పనిచేస్తుంటాడు. రోజుమాదిరిగానే మంగళవారం ఫ్యాక్టరీకి వచ్చాడు. సహచర కూలీలతో కలిసి లారీకి సరుకు లోడ్ చేశారు. అనంతరం ప్లాట్‌ఫాంకు లారీకి మధ్య వెంకటేశ్వర్లు ఉండగా లారీని డ్రైవర్ వెనక్కి అనగా ప్లాట్‌ఫాంకి, లారీకి మధ్యపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై బి.మహేంద్ర కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు

బావిలో పడి యువకుడి మృతి

కొండపి, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జరుగుమల్లి మండలం పీరాపురం గ్రామానికి చెందిన మారంరెడ్డి రామకృష్ణారెడ్డి (40) కొండపి మండలం జాళ్ల పాలెం-కోయవారిపాలెం గ్రామాల మధ్యన ఉన్న బావిలో పడి మంగళవారం మరణించాడు. సమాచారం అందుకున్న ఎస్సై ప్రేమ్‌కుమార్ ఘటనా స్థలానికి వెళ్లారు. ప్రాథమిక సమాచారం ప్రకారం రామకృష్ణారెడ్డి వ్యసనాలకు బానిసైనట్లు తెలిసిందని ఎస్సై చెప్పారు. ఆయన ప్రమాదవశాత్తూ బావిలో పడ్డాడా? లేక ఆత్మహత్య చేసుకున్నాడా? అన్నది విచారిస్తున్నట్లు చెప్పారు.

రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

ఒంగోలు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైళ్ళలో గంజాయి, డ్రగ్స్ రవాణాను అరికట్టేందుకు రైల్వే పోలీసులు, ఈగల్ టీమ్ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. మంగళవారం ఒంగోలులోని రైల్వేస్టేషన్‌లో పోలీసులు పలు రైళ్ళలో విస్తృతంగా సోదాలు చేశారు. గంజాయి, డ్రగ్స్ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐలు సుధాకర్, శ్రీనివాసరావు, ఎస్ శ్రీకాంత్, చెంచయ్య, ఆర్పీఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎంకు గిన్నిస్ రికార్డుపై హర్షం

ఒంగోలు విద్య, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు గిన్నిస్ బుక్‌లో స్థానం లభించడం పట్ల తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మంగళవారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తంచేసింది. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 53.4 లక్షల పేరెంట్స్ టీచర్లు పాల్గొన్న అతి పెద్ద మీటింగ్‌గా గుర్తించారు. మొత్తం 1.5 కోట్లమంది పాల్గొన్నారు. ఇంత ఘనకీర్తిని సాధించిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విద్యాశాఖ అధికారులు, టీచర్లకు టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రాంబాబు, యనమల ఆంజనేయులు, కె.వెంకట్రావు, రవీంద్ర, సీహెచ్.పూర్ణచంద్రరావు తదితరులు అభినందనలు తెలియజేశారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

నాగులుప్పలపాడు జూలై 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివాస గృహాలు, స్థలాల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఎంపీడీవో రవికుమార్ సూచించారు. నాగులుప్పలపాడు మండల పరిషత్ కార్యాలయంలో స్వామిత్వ సర్వేపై జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని స్థలాలు, నివాస గృహాల వివరాలను స్వామిత్వ సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అవీ.. ఇవీ..

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించండి

● మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు


సచివాలయాల సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్

చీరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పురపాలక సంఘం పరిధిలోని 33 వార్డుల్లో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు అన్నారు. మంగళవారం చైర్మన్ ఛాంబర్‌లో వార్డు సచివాలయాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది విధిగా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రఘురామ్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ


విజేతలతో కళాశాల ప్రతినిధులు

చీరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రతిభ చాటారు. బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఇటీవల విజయవాడ కానూర్‌లో చెన్నపట్టు రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఓపెన్ క్యెరుగి అండ్ పుమ్‌సె తైక్వాండో ఛాంపియన్‌షిప్ -2025 పోటీలు నిర్వహించారు. ఈ క్రమంలో పోటీల్లో కళాశాలలో సైబర్ సెక్యూరిటీ నాల్గవ సంవత్సరం చదువుతున్న ఎస్‌కే షహీద్ బంగారు పతకం, 54 కిలోల విభాగంలో మణిదీప్ కాంస్యం, అలాగే సీఎస్సీ విభాగంలో చదువుతున్న భానురేఖ అండర్ 59 కేటగిరీలో కాంస్యం సాధించారు. దీంతో మంగళవారం కళాశాలలో కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డా. జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ

మార్టూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): అది మండలంలోని ఇసుకదర్శి గ్రామంలోని ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఉదయం ఎంఈవో సీహెచ్‌ఎం వస్రామ్ నాయక్ తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదవడం, రాయడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థుల హాజరు పుస్తకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

గోశాలకు వరిగడ్డి అందజేత

అద్దంకిటౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో మంగళవారం హరిహర గోశాలకు రోటరీ మిత్రుల సౌజన్యంతో రూ.11 వేల విలువైన వరిగడ్డిని అందజేశారు. గో సంపదను రక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బాచిన శివధర పూర్ణచంద్రరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, వీరయ్య, శ్రీనివాసరావు, మురళీ సుధాకరరావు, మురళీకృష్ణ, రామకోటేశ్వరరావు, గోశాల నిర్వాహకుడు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థులకు ఆర్థికసాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ఉపాధ్యాయినులు

వేటపాలెం(చీరాల), జూలై 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు ఉపాధ్యాయినులు ఆర్థికసాయం అందజేశారు. వేటపాలెం మండల పరిధిలోని పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలలో 6, 8 తరగతులు చదువుతున్న అక్కా తమ్ముడు కోడూరు సిరి, పూర్ణచంద్రరావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దీంతో స్పందించిన పాఠశాల ఉపాధ్యాయినీలు రామచంద్రపురంలోని వారి ఇంటికి వెళ్లి రూ.15 వేలు అందజేశారు. ప్రధానోపాధ్యాయిని దీప్తి, ఉపాధ్యాయులు బుద్ధిమోహన్ రావు, లలిత పరమేశ్వరి, భవానీ దేవీ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లకు ఆహ్వానం

చీరాల, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్స్ డ్రైవర్స్‌కు ఆహ్వానం పలుకుతు న్నట్లు డీఎం జంజనం శ్యామల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో అర్హులుగా కనీసం 18 నెలలు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ఆసక్తి కలవారు ఆగస్టు 2వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 7382887927, 7095078509 నెంబర్లను సంప్రదించాలన్నారు.

రోడ్డు పక్కనే గ్రానైట్ వ్యర్థాలు

● కాలుష్యానికి కేరాఫ్ నాగరాజుపల్లి రోడ్డు ● వాహనదారుల అవస్థలు,పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

మార్టూరు, జూలై29 (ఆంధ్రజ్యోతి): మార్టూరు నుంచి నాగరాజుపల్లి వెళ్లే మార్గం కాలుష్యానికి చిరునామాగా నిలుస్తోంది. పట్టుమని ఐదుకిమీ దూరం కూడా ఈ గ్రామం ఉండదు. అయితే కొంతకాలం నుండి ఈ రహదారి గ్రానైట్ వ్యర్థాల డంపునకు చిరునామాగా కనిపిస్తోంది. రోజూ ఈ రహదారిలో బల్లికురవ, సంతమాగులూరు మండలాలలోని గ్రానైట్ క్వారీల నుంచి రాళ్లను తీసుకొస్తారు. మార్టూరుకు తీసుకువస్తున్న గ్రానైట్ ముడిరాయి లారీలు, ఇతర ప్రాంతాలకు పంపించే గ్రానైట్ శ్లాబుల లారీలు, ఈ దారిలో నిత్యం ప్రయాణిస్తూనే ఉంటాయి. నిత్యం గ్రానైట్ డస్ట్‌ను తరలించే ట్రాక్టర్లు, టిప్పర్లు, కూడా ఈ మార్గంలో వెళుతుండడంతో రోడ్డుపై పెరిగిన దుమ్ము ధూళితో నాగరాజుపల్లి రోడ్ కాలుష్యానికి కేరాఫ్‌గా మారింది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఈ రహదారిలో ప్రయాణిస్తే వారి శరీరమంతా గ్రానైట్ వ్యర్థతో నిండే పరిస్థితి ఉంది. ఈ క్రమంలోనే రోడ్డు ప్రక్కన పొలాలను కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు పొలాలను మెరక చేసేందుకు గ్రానైట్ డస్ట్‌ను వినియోగించడంతో, గాలికి పొలాల్లోని గ్రానైట్ బూడిద రోడ్డుపైన ప్రయాణించే వాహనదారులను ఇబ్బంది పెడుతోంది.


రోడ్డుపక్కన పొలాల్లో తోలిన గ్రానైట్ డస్ట్

ఇవి చాలవనట్లు గ్రానైట్ పరిశ్రమలలోని వ్యర్థాలను కొంత మంది గ్రానైట్ పరిశ్రమల యజమానులు రాత్రికి రాత్రే రోడ్డుపక్కన వాటిని ట్రాక్టర్లులో, టిప్పర్లులో తీసుకువచ్చి డంపింగ్ చేయిస్తున్నారు. వారిని ఇదేమిటని అడిగే వారు లేకుండా పోయారు.

రోడ్డు మలుపులు ప్రాణాంతకాలు

ఈ రోడ్డులో ప్రమాదకరమైన మూడు మలుపులు ఉన్నాయి. వాటి వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా తిరుగుతున్న గ్రానైట్ వాహనాలు, ద్విచక్రవాహనాలు, ఇక ప్రవేటువాహనాలు, ఆటోలతో రోడ్డు మీద ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. ఇటీవల ఒక మలుపు వద్ద లారీ ఢీ కొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. గతంలో ఆటోలో వస్తున్న ఒక ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రోడ్డు ప్రమాదంలో చనిపోయారు. అదేవిదంగా నెల రోజులు క్రితం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందారు. అంతేగాకుండా ఒక మలుపు వద్ద లారీ ఆఫీసు ఉండడంతో, అక్కడ పార్కింగ్ చేసిన లారీలు కనబడకపోవడంతో, వేగంగా వస్తున్న ద్విచక్రవాహనదారుడు, రోడ్డుపై మరో ద్విచక్రవాహనంపై ఆగి ఉన్న హోంగార్డును ఢీకొట్టాడు. ఇంకా ఇలాంటి ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయి రాత్రి సమయంలో అయితే ఈ రోడ్డుపై, ఆటోలలో, ద్విచక్రవాహనాలలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా ఉందనడంలో ఎలాంటి అతిశయోక్తికాదు. మొత్తం మీద ఈ రహదారిలో కాలుష్యంతో పాటు, కనిపించని రోడ్డు ప్రమాదాలు దాగి ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


నాగరాజుపల్లె రోడ్డులో రోడ్డు అంచులో వేసిన గ్రానైట్ వ్యర్థాలు

వరి పైరుకు బీమా పథకం వర్తింపు

అద్దంకిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వరి పైరుకు పంటల బీమా పథకం వర్తిస్తుందని రైతులు ఎకరాకు రూ.800 చెల్లించి నమోదు చేసుకోవాలని ఏడీఏ బి. ఏడ్రాయిము అన్నారు. మంగళవారం మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పరిధిలో సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉద్యానశాఖ అధికారిణి ఎస్. దీప్తి మాట్లాడుతూ మల్లెతోటలలో సమగ్ర సస్య రక్షణ చర్యలు గురించి తెలుసుకోవాలన్నారు. మల్లెతోటల్లో మొగ్గతొలుచు పురుగును గమనించినట్లు పేర్కొన్నారు. దీని నివారణకు థయోమిధాగ్జామ్ 1.5 ఎం.ఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. ఈ ఏడాది నల్లబర్లీ పొగాకు నిషేదించినట్లు ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. నల్లబర్లీ పొగాకు నారుమడులు సాగుచేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వీఏఏ పృధ్వి సాయి, రైతులు రామకృష్ణ, వీరయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


పేరాయపాలెంలో మల్లెతోటలను పరిశీలిస్తున్న ఏడీఏ

ఆధునిక పద్ధతులు పాటించాలి

పంగులూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని ముప్పవరం, బైటమంజులూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయ విధానంలో సేంద్రీయ ఎరువుల వాడకంతో నాణ్యమైన పంట దిగుబడులు సాధించాలన్నారు. పంటసాగుకు ముందు విత్తనశుద్ధి చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బ్రహ్మానందస్వామి, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ శివరాజు, వ్యవసాయ సహాయకులు బీ.బీ.జాన్, గోపీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కారు అద్దాలు పగలగొట్టిన అగంతకులు



పగిలిన కారు అద్దం

మార్టూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయిబాబా వాటర్‌ప్లాంట్ సమీపంలో పార్కింగ్ చేసిన కారు అద్దాలను సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టారు. స్థానిక బలరాంకాలనీలో నివసిస్తున్న కారు యజమాని ఉప్పుటూరి జానకిరామ్ కారును బాడుగకు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటారు. అయితే అతను రాత్రి సమయంలో తన ఇంటి వద్ద పార్కింగ్ చేయడానికి స్థలం లేకపోవడంతో, సమీపంలోని మరో ఖాళీ ప్రదేశంలో రోజూ కారును పార్కింగ్ చేస్తుంటాడు. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి అతను అక్కడ కారును పార్కింగ్ చేశారు. అయితే మంగళవారం ఉదయానికి కారు అద్దాలు పగల గొట్టి ఉన్నాయని సమీపంలోని ఓ వ్యక్తి జానకిరామ్‌కు సమాచారం అందించాడు. దాంతో జానకిరామ్ కారు వద్దకు వెళ్లి చూడగా, కారు ముందు వెనుక అద్దాలు పగలగొట్టి ఉన్నాయని, అంతేగాకుండా కారు వెనుక సీటులో పెద్దరాయి ఉందని గమనించాడు. ఈ విషయమై మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాత మద్రాసు రోడ్డుకు మరమ్మతులు

పర్చూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు నుంచి ఒంగోలు వెళ్లే పాతమద్రాసు రోడ్డులో ప్రస్తుతం మరమ్మతు పనులు చేపడుతున్నారు. గత వైసీపీ పాలనలో రోడ్లు కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో అస్తవ్యస్తంగా మారాయి. ప్రధానరోడ్లు సైతం పెద్దపెద్ద గుంతలతో దర్శనమిచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే పర్చూరు - ఇంకొల్లు మీదుగా ఒంగోలు వెళ్లే పాతమద్రాసు రోడ్డు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరుణంలో ఈరోడ్డు అభివృద్ధికి రూ.23.88 కోట్లు నిధులు కేటాయించినా రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. కొన్ని సాంకేతిక సమస్యల కారణంగా రోడ్డు నిర్మాణంలో జాప్యం నెలకొంది. అయితే రోడ్డు పరిస్థితి, ప్రయాణికులు, వాహనదారులు ప్రజలు పడుతున్న ఇబ్బందిపై స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టి సారించడంతో పెద్ద ఎత్తున నిధులు మంజూరు అయ్యాయి. అయితే ప్రయాణికులు రాకపోకలు సాగించే విధంగా ప్రస్తుతం రోడ్డుకు మరమ్మత్తులు చేపడుతున్నారు. రహదారిలో ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను తారుతో మరమ్మత్తులు చేసేవిధంగా చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయితే ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో త్వరితగతిన రోడ్డును అభివృద్ధి చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.


రహదారి మరమ్మతులు చేస్తున్న కార్మికులు

ఫిల్టర్‌బెడ్ మరమ్మతు పనులు ప్రారంభం


ఇసుకను తోడుతున్న ఎక్స్‌కవేటర్

యద్దనపూడి,(మార్టూరు) జూలై29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతవరం గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఫిల్టర్‌బెడ్ మరమ్మత్తుల పనులు ప్రారంభమయ్యాయి. గ్రామంలో ప్రజలకు శుభ్రమైన తాగునీరు అందించడానికి, ఫిల్టర్ బెడ్, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు నిరుపయోగంగా ఉండడంతో ప్రజలకు తాగునీటిని ఇవ్వలేకపోయారు. దీంతో వాటికి మరమ్మతులను చేయించాలని నాయకులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుదృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన డీఎంఎఫ్ నిధులు రూ.10 లక్షలను మంజూరు చేయించారు. ఈ నిధులతో నాయకులు పనులను ప్రారంభించారు. మొదట పాత ఫిల్టర్‌బెడ్‌లోని, ఇసుకను తొలగించారు. అదేవిదంగా ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను శుభ్రం చేయించారు. ఇక ఫిల్టర్‌బెడ్‌లో కొత్తగా ఇసుకను, మెటల్‌ను నింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం జరుగుతున్న ఫిల్టర్‌బెడ్ పనులను గ్రామ నాయకులు పరిశీలించారు. పనులను నాణ్యతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా చేసి, గ్రామస్థులకు తాగునీటిని అందించాలని పనులను వేగంగా చేయాలని నాయకులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గుదే తారకరామారావు, కొరటాల వంశీకృష్ణ, మానుకొండ రామేశ్వరరావు, గుత్తా వాసుబాబు, పోపూరి సాంబశివరావు, ఆరెకట్ల సాంబశివరావు, పోపూరి హనుమంతరావు, పెడవల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో విద్యార్థుల సత్తా

చినగంజాం, జూలై 29(ఆంధ్రజ్యోతి) : జాతీయస్థాయి తైక్వాండో పోటీలలో చినగంజాం విద్యార్థులు సత్తాచాటారు. విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 25, 26, 27 తేదీలలో 10వ జాతీయ నేషనల్ ఓపెన్ క్యోరుగి పూమ్సే తైక్వాండో చాంపియన్ షిప్-2025 పోటీలు జరిగాయి. ఈ పోటీలలో సత్యం హైస్కూల్, చినగంజాం, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు ఉమ్మడి ప్రకాశం జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం తెలిపారు. సత్యం హైస్కూల్‌కు చెందిన బి.మహాలక్ష్మి, డి.దేవాదిత్య,(గోల్డ్ మెడల్), కే.శ్రీదుర్గహర్షిత, కే.రక్షితారెడ్డి, (రంజిత), ఎం.జనని, సీ.హెచ్. అవిత్ (కాంస్య), చినగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సీ.హెచ్.జాషువా, బి.యశ్వంత్, కే.ప్రాదిత్యారెడ్డి(గోల్డ్ మెడల్స్), జి.శ్రీహర్ష(బ్రాంజ్), రాజుబంగారుపాలెం జడ్పీ పాఠశాలకు చెందిన కే.మనోజ్ఞ(బ్రాంజ్ మెడల్)లు సాధించినట్లు తెలిపారు. సత్యం హైస్కూల్‌లో మంగళవారం జరిగిన అభినందన సభలో తైక్వాండోలో పతకాలు సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ నున్నా హరనాథ్‌బాబు, ఉపాధ్యాయులు, తైక్వాండో జిల్లా కార్యదర్శి అబ్దుల్‌సలాం, కోచ్ వాటుపల్లి సుబ్రహ్మణ్యం, క్రీడాకారుడు పొగడదండ శివప్రసాద్‌లు అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న శిక్షకుడు, ఉపాధ్యాయులు

టీబీ బాధితులకు పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహరాన్ని అందజేస్తున్న డాక్టర్ వాహిల చౌదరి

అద్దంకిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రాంతీయ వైద్యశాలలో ప్రధాన మంత్రి టీబీ ఫ్రీ ఇండియా ప్రచార కార్యక్రమంలో భాగంగా, అద్దంకి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని అందజేశారు. జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి, క్యూట్ రూట్ ఫౌండేషన్ చీఫ్ ఆఫీసర్ అశోక శర్మ, అసిస్టెంట్ చైర్మన్ స్నేహ అగర్వాల్ సౌజన్యంతో సుమారు 200 మందికి ఈ పౌష్టికాహార కిట్లు అందజేసినట్లు వైద్యశాల వైద్యురాలు కే.వాహిల చౌదరి పేర్కొన్నారు. వ్యాధిగస్తులకు పౌష్టికాహారం అందించడం కోసం దాతలు ముందుకు వచ్చి సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటకిరణ్, డాక్టర్ తేజస్వి, డాక్టర్ అనితాజ్యోతి, డాక్టర్ ప్రదీప్‌కుమార్, యూపిహెచ్‌సి వైద్యులు డాక్టర్ జయసింహ, డాక్టర్ హర్ష, సిహెచ్‌సి హెచ్‌డిసి కమిటి సభ్యులు ధర్మవరపు నాగేశ్వరరావు, జిల్లా పీపీఎం సమన్వయకర్త డి.కార్తీక తదితరులు పాల్గొన్నారు.

కార్మికులపై లాఠీచార్జ్ దుర్మార్గపు చర్య


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అద్దంకిటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): సమ్మె చేస్తున్న కార్మికులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయడం దుర్మార్గపు చర్య అని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణంలో నెల్లూరులో మున్సిపల్ కార్మికులపై పోలీసుల లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ, అద్దంకి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆదాం, వీరయ్య, శామ్యూల్, కోటయ్య, రమేష్, రవితేజ, రాఘవయ్య, అలివేలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కోటపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా రావుల

పంగులూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు పీఏసీఎస్ చైర్మన్‌గా రావుల సింగరకొండ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కోటపాడు పీఏసీఎస్ కార్యాలయంలో నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. చైర్మన్‌గా రావుల సింగరకొండ, సభ్యులుగా మక్కెన ఆంజనేయులు, కట్టా సుబ్బారావు ప్రమాణస్వీకారం చేశారు. సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తానని చైర్మన్ సింగరకొండ తెలిపారు. కార్యక్రమంలో తాటి సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడుకొండలు, పేర్ని లక్ష్మీ నారాయణ, చింతల సహదేవుడు, కాటా అంజయ్య, గడ్డం నాగేశ్వరరావు, బత్తుల వెంకటరావు, పూనాటి రామాంజనేయులు, ప్రత్యేకాధికారి సర్దార్ అహమ్మద్, సీఈవో కొల్లి మల్లారెడ్డి, పలువురు స్థానిక నేతలు, రైతులు పాల్గొన్నారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న సింగరకొండ

పొగాకు నాణ్యత ప్రమాణాలపై అవగాహన

చినగంజాం, జూలై 29(ఆంధ్రజ్యోతి) : చినగంజాంలోని పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ గోడౌన్‌లోని పొగాకు కొనుగోలు కేంద్రాన్ని చీరాల వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పొగాకు కొనుగోలు ప్రక్రియను మార్కెఫెడ్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పరిశీలించి, బయ్యర్‌కు పలు సూచనలు చేశారు. సంతరావూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, అధికారులు, రైతులతో మాట్లాడారు. 13 మంది రైతుల వద్ద నుండి 250 క్వింటాళ్ల పొగాకు కొనుగోలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ప్రభాకరరావు, మండల వ్యవసాయాధికారి ఆర్.చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

పంగులూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవసాయ పరపతి సంఘం ద్వారా రైతాంగానికి మెరుగైన సేవలు అందిస్తానని జేవీ.పాలెం పీఏసీఎస్ చైర్మన్ అల్లంనేని బ్రహ్మానందస్వామి అన్నారు. జాగర్లమూడివారిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా అల్లంనేని బ్రహ్మానందస్వామి, సభ్యులుగా దూళిపాళ్ల ప్రసన్నాంజనేయులు, మట్టికొయ్య బ్రహ్మయ్యలు మంగళవారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలను స్వీకరించారు. చైర్మన్ స్వామి మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలను అందిస్తా మన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కుక్కపల్లి ఏడు కొండలు టీడీపీ మండల అధ్యక్షులు రావూరి రమేష్, డీసీ అధ్యక్షులు కుక్కపల్లి ఆంజనేయులు, కేవీ.సుబ్బారావు, బాలిన రామసుబ్బారావు, చింతల సహదేవుడు, నార్నె.సుబ్బారావు, గుర్రం ఆదిశేఖర్, ఓబుల్‌రెడ్డి, పూనాటి రామాంజనేయులు, మస్తాన్‌వలి, చంద్రశేఖర్, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, వరపర్ల సుబ్బారావు, గరిమిడి జగన్, బత్తుల వెంకటరావు, సుబ్బారెడ్డి, ఉన్నం రవిబాబు, తాటి సుబ్బారావు, జాగర్లమూడి శ్రీనివాసరావు, డి.నారాయణస్వామి, సీఈవో మోహన్‌కృష్ణ పలుగ్రామల నేతలు పాల్గొన్నారు. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న బ్రహ్మానందస్వామి